సోమవారం
28-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 68
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జింబాబ్వే అధ్యక్షుడిగా మళ్లీ ఎమర్సన్ మ్నాంగాగ్వా

జింబాబ్వే అధ్యక్షుడిగా ఎమర్సన్ మ్నాంగాగ్వా రెండోసారి ఎన్నికయ్యారు. మ్నాంగాగ్వాకు 52.6శాతం ఓట్లు రాగా ఆయన ప్రధాన ప్రత్యర్థి నల్సన్ ఛమీసాకు 44శాతం ఓట్లు వచ్చినట్లు జింబాబ్వే మీడియా ఆదివారం వెల్లడించింది.

2 లో

ఇంధనాన్నీ మింగేశాడు!



- వెలికి వచ్చిన అదానీ మరో కుంభకోణం
- గుజరాత్ ఇంధన విభాగం నుంచి రూ. 3802 కోట్లు స్వాహా
- ఆలస్యంగా కళ్లు తెరిచిన అధికారులు

అహ్మదాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కొత్త కుంభకోణం బయటపడింది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన గుజరాత్ ఇంధన విభాగం గత అయిదు సంవత్సరాలలో రూ. 3,802 కోట్లు లెక్కా పత్రం, ఎలాంటి రసీదులు, బిల్లులు లేకుండా చెల్లించేసింది. గుజరాత్ ఊర్జా వికాస నిగం లిమిటెడ్ అనే ప్రభుత్వ సంస్థ ఈ విషయాన్ని గుర్తించి ఎక్కువగా చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేయాలని మే 15న అదానీకి ఒక లేఖ రాసిన విషయం తాజాగా బయటపడింది. గుజరాత్ ఇంధన విభాగం అదానీ పవర్‌తో విద్యుత్తు కొనడానికి రెండు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల కిందే అదానీకి చెల్లించవలసిన దానికన్నా రూ. 3.802 చెల్లించారు. విద్యుత్ సరఫరా చేయడానికి అదానీ పవర్ బొగ్గు దిగుమతి చేసుకుంటుంది. బొగ్గు ధరల్లో హెచ్చు తగ్గులు ఉంటాయి కనక ధర పెరిగినప్పుడు ఎక్కువ మొత్తం చెల్లించే వారు. అదానీ పవర్ ఇండోనేసియా నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటుంది. తక్కువ ధరకు కొన్నా ఎక్కువ ధర గుజరాత్ ప్రభుత్వం దగ్గర వసూలు చేసింది. ఈ వ్యవహారం 2018 నుంచి సాగుతోంది. అదానీ కుంభకోణం బయట పడడం, ఈ విషయమై దర్యాప్తు చేయాలని సుప్రీంకోర్టు సెబీని ఆదేశించడంతో తాజా కుంభకోణం తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని భయపడ్డ గుజరాత్ విద్యుత్ విభాగం అధికారులు ఎక్కువ చెల్లించిన మొత్తం వెనక్కు ఇచ్చేయాలని లేఖ రాయడంతో ఈ కుంభకోణం బయట పడింది. అయిదేళ్ల నుంచి అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్న తలెత్తవచ్చు. అదానీ ప్రధానమంత్రి మోదీకి అత్యంత సన్నిహితుడైనందున అధికారులు కూడా చేసేదేమీ లేక అదానీ అడిగినంత డబ్బు చెల్లించేశారు. మరీ విచిత్రం ఏమిటంటే ఈ డబ్బు తీసుకున్న అదానీ పవర్ రసీదులూ ఇవ్వలేదు. సంబంధిత పత్రాలూ అందజేయలేదు. ఇండోనేసియా నుంచి బొగ్గు ఎంతకు కొన్నారన్న

- మిగతా 2 లో

ఉమ్మడి జాబితాపై కేంద్రం కన్ను

ప్రతిపక్షాల గొంతునొక్కే ఆయుధంగా మార్చుకుంటున్న మోదీ సర్కార్

రాష్ట్రాల అధికారాలను కత్తిరించేలా ఎన్డీయే ప్రభుత్వ అడుగులు

న్యూఢిల్లీ: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ఉమ్మడి జాబితాను మరో ఆయుధంగా చేసుకొంటున్నది. రాష్ట్రాల సమ్మతితో పని లేకుండా ఉమ్మడి జాబితాలోని అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొంటున్నదని విశ్లేషకులు చెబుతున్నారు. గత ఏడాది మొదట్లో ఐఏఎస్ క్యాడర్ రూల్స్‌ను సవరిస్తూ ప్రతిపాదనలు చేసింది. రాష్ట్రాల సమ్మతితో పని లేకుండా ఐఏఎస్ అధికారులను కేంద్రానికి డిప్యూటేషన్‌పై తీసుకోవచ్చనేది దాని ప్రధాన సారాంశం. కేంద్రానికి ఇలాంటి విస్తృత అధికారాలు లభిస్తే, సీనియర్ బ్యూరోక్రసీ విధేయత, సమ్మతి విషయంలో సంక్షోభం వస్తుందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, రాజస్థాన్, తెలంగాణ తదితర రాష్ట్రాల ముఖ్యమంత్రులు లేఖలు రాశారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రాష్ట్రాలపై రుద్దే ప్రయత్నం చేయగా.. ఒప్పందంపై 14 రాష్ట్రాల సీఎంలు సంతకాలు చేయలేదు. సహకార వ్యవస్థలో జోక్యం చేసుకొని, దాన్ని నాశనం చేసేందుకు కేంద్రం కంకణం కట్టుకొన్న కేంద్రం సొంతంగా సహకార చట్టాన్ని ఆమోదించుకోవడం ఇందుకు ఒక ఉదాహరణ. రాష్ట్రాల జాబితాలోని

- మిగతా 2 లో

'ఇండియా' వైపు ఎన్డీయే పక్షాల మొగ్గు

నాగపూర్: ఇండియా కూటమిలో చేరేందుకు ఎన్డీయే మిత్రపక్షాలు కొన్ని ఆసక్తిగా ఉన్నట్లు కాంగ్రెస్ అధికార ప్రతినిధి అలోక్ శర్మ తెలిపారు. ఎన్డీయే సమావేశానికి 38 పార్టీలు హాజరు కాగా అందులో కనీసం నాలుగు, ఐదు పార్టీలు తమతో చర్చలు జరుపుతున్నాయని, 'ఇండియా' భాగస్వామ్యానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఇంకొన్ని పార్టీలు 2024లో ఎన్నికలకు ముందు చేరుతాయన్నారు. ఆదివారం నాగపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శర్మ మాట్లాడుతూ దేశాన్ని ఏకం చేసే శక్తికి మరింత బలాన్ని సమకూర్చడమే కాంగ్రెస్ ప్రస్తుత లక్ష్యమన్నారు. '2024 సంవత్సరం ఇండియాది' అని అన్నారు. మహారాష్ట్రలో మహా వికాస్ అగాధీకి కాంగ్రెస్ నాయకత్వం వహిస్తుందా అన్న ప్రశ్నకు 'ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరు దేనికి నాయకత్వం వహిస్తారన్నది ముఖ్యం కాదు. అందరం ఐక్యశక్తిగా అహంకారపూరిత ప్రభుత్వాన్ని ఎలా గద్దె దించాలన్నదే ముఖ్యం' అని అలోక్‌శర్మ చెప్పారు. అమేథి నుంచి గాంధీ కుటుంబం నుంచి ఎవరు పోటీ చేస్తారన్నది రాహుల్ గాంధీ, ఆయన కుటుంబసభ్యులు నిర్ణయిస్తారని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. గాంధీ కుటుంబ సభ్యులకు అమేథి ప్రజల ఆదరణ, అభిమానం ఉందన్నారు. గతంలో రాహుల్ గాంధీపై బీజేపీ నేత స్మృతీ ఇరానీ విజయంపై ప్రశ్నకు ఇప్పుడు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోటీ చేసినాగానీ ఆమె ఓడిపోతారని అలోక్‌శర్మ దీమా చెప్పారు. అదే సమయంలో తాజాగా వెలుగులోకి వచ్చిన కాగ్ నివేదికలతో పాటు ఎన్‌హెచ్ఏఐ, ఆరోగ్యం, బీమా రంగాల్లో అవినీతిపై సీబీఐ, ఈడీ విచారణలకు ఆదేశాలు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ప్రధాని మోదీని ఆయన డిమాండ్ చేశారు.

అందరి దృష్టి ఆ భేటీ పైనే...

- ముంబై వేదికగా మూడో సమావేశం
- లోగో, సీట్ల సర్దుబాటే అజెండా
- ఎన్నికల వ్యూహాలపై ప్రధానంగా చర్చ
- కూటమిలోకి మరికొన్ని పార్టీలు

న్యూఢిల్లీ: ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' మూడో సమావేశానికి చకాచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 31, సెప్టెంబరు 1వ తేదీల్లో మహారాష్ట్ర రాజధాని ముంబైలో జరగబోయే సమావేశానికి విచ్చేయనున్న కూటమి నాయకులకు శివసేన (యూబీటీ) ఆతిథ్యమిస్తోంది. ఇందుకోసం గ్రాండ్ హయాత్ హోటల్‌లో 200కుపైగా గదులను బుక్ చేసింది. మహావికాస్ అగాధీలోని శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్‌సీపీ పార్టీలు సంయుక్తంగా అన్ని ఏర్పాట్లు చూస్తున్నాయి. కూటమిలోని పార్టీలు అధికారంలోని లేని రాష్ట్రంలో ఈ సమావేశం జరుగుతుండటం ఆసక్తికరంగా మారింది. ముంబై వేదికగా ఇండియా కూటమి లోగోను ఆవిష్కరించడంతో పాటు రెండు రోజుల సమావేశాల్లో భాగంగా సీట్ల సర్దుబాటు, ఎన్నికల వ్యూహాలపై ప్రధానంగా చర్చ జరుగుతుందని తెలుస్తోంది. దేశానికి,

- మిగతా 2 లో

చంద్రుడిపై ఉష్ణోగ్రత లెక్క దొరికింది !

తొలి పరిశోధన ఫలితాలొచ్చాయ్

గ్రాఫ్ విడుదల చేసిన ఇస్రో



2 లో

డబుల్ ఇంజిన్... ఓ వైఫల్య సిద్ధాంతం

- అందుకు మణిపూర్ ఘటనలే నిదర్శనం
- బీజేపీకి సహకరించే వారు సమాజానికి శత్రువులే
- గుంటూరు బహిరంగ సభలో నారాయణ

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు: దేశంలో ఫెడరల్ రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేలా... ఏక పరిపాలన తెచ్చేందుకు బీజేపీ రచిస్తున్న డబుల్ ఇంజిన్ సిద్ధాంతం ఒక వైఫల్య సిద్ధాంతమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న ఘటనలే అందుకు నిదర్శనమని తెలిపారు. కేంద్రంలోనూ, మణిపూర్ రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికి అక్కడ జరుగుతున్న మారణహోమాన్ని నిలువరించడంలో విఫలమయ్యాయని చెప్పారు. రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి... అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం ఉదయం గుంటూరు నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా, నగర నాయకులు బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ మణిపూర్‌లో అగ్గి మోదీ అయితే... ఆజ్యం అమిత్ షా అని ఘాటుగా విమర్శించారు. పోలీసుల సమక్షంలోనే మహిళలను వివస్త్రలను చేసి అత్యాచారం జరిపి హత్య చేయడం అక్కడి

- మిగతా 2 లో

సెబాస్టియన్‌ది అక్రమ అరెస్టు

2 లో

ఇదీ లోకం!

నీ కాస్ట్యూమ్‌లో... ఏదో తేడా వుంది నాయనా!

పదవుల దుమారం

- టీటీడీ పాలకమండలిలో నేరచరితులకు స్థానం
- వైసీపీ ప్రభుత్వాన్ని తూర్పారబడుతున్న ప్రతిపక్షాలు
- పదవి దక్కని అధికారపార్టీ నేతల్లో అసంతృప్తి జ్వాల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలక మండలి నియామకం విషయంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. మండలికి కొత్తగా నియమితులైన సభ్యుల్లో కొందరు నేర చరిత్ర గలవారు ఉండటాన్ని ప్రతిపక్ష పార్టీలు తప్పుబడుతున్నాయి. టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారంటూ బీజేపీ, టీడీపీలు తూర్పారబడుతున్నాయి. టీటీడీ పవిత్రతను మంట గలిపారంటూ ధ్వజమెత్తుతున్నాయి. రాష్ట్రప్రభుత్వం ఇటీవల 28 మందితో టీటీడీ పాలక మండలిని నియమించింది. మండలి సభ్యులుగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన వారున్నారు. అందులో కొంతమంది నేర చరిత్ర గలవారు, మద్యం కేసులో ఉన్న వారున్నారని, వారిని ఎలా నియమిస్తారంటూ ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. టీటీడీ చైర్మన్‌గా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి, సభ్యుల నియామకం వరకు ప్రతిపక్షాలు అనేక అభ్యంతరాల్ని లేవనెత్తుతున్నాయి. ప్రభుత్వం వాటిని ఖాతరు చేయకుండా ఇష్టానుసారంగా సభ్యుల్ని నియమించింది. టీటీడీ బోర్డు సభ్యుల నియామకానికి ప్రతిసారీ గట్టిపోటీ ఉంటుంది. గతంలో తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన మండలి సభ్యుల నియామకం కాస్తా, మిగిలిన రాష్ట్రాలకూ విస్తరించింది. వారిలో ఆధ్యాత్మికంగా ప్రసిద్ధి చెందిన వారు, మంచి వ్యక్తులు ఉంటే ఫర్వాలేదు. దానికి విరుద్ధంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారికి వైసీపీ ప్రభుత్వం చోటు కల్పించిందని బీజేపీ, టీడీపీ

- మిగతా 2 లో

అంగన్‌వాడీల సమస్యలపై సీఎం నిర్లక్ష్యం

- ప్రజాసమస్యలు పట్టని ప్యాలెస్ పెద్ద మనిషి జగన్
- అంగన్‌వాడీల సదస్సులో ఓబులేసు

2 లో

జింబాబ్వే అధ్యక్షుడిగా మళ్లీ ఎమర్సెన్ మ్నాంగాగ్వా

వరుసగా రెండోసారి ఎన్నిక

ఎన్నికల పారదర్శకతపై అనేక అనుమానాలు

హరారే: జింబాబ్వే అధ్యక్షుడిగా ఎమర్సెన్ మ్నాంగాగ్వా రెండోసారి ఎన్నికయ్యారు. మ్నాంగాగ్వాకు 52.6శాతం ఓట్లు రాగా ఆయన ప్రధాన ప్రత్యర్థి నల్సన్ ఛమీసాకు 44శాతం ఓట్లు వచ్చినట్లు జింబాబ్వే మీడియా ఆదివారం వెల్లడించింది. మొత్తం 4.5 మిలియన్ల మంది ఓటింగ్‌లో పాల్గొనగా 68.9శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపింది. అయితే అధికార పార్టీ జెడ్ఏఎన్‌యూ-పీఎఫ్ ఎన్నికల్లో మోసాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో శనివారం దేశాధ్యక్షుడిగా మ్నాంగాగ్వా మరోమారు ఎన్నిక కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఆ దేశం తప్పుడు ఆర్థిక విధానాల వల్ల రెండు దశాబ్దాలుగా సంక్షోభంలో చిక్కుకొని ఉంది. జింబాబ్వేలో నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. ధరలు దిగిరాని పరిస్థితి ఉంది. వైద్య వ్యవస్థ కుంటుపడింది. కనీస వైద్య సదుపాయాలు, పరికరాలు, మందులు లేవు. పాశ్చాత్య దేశాలు ఏకాకి చేయడం కూడా జింబాబ్వేకు సమస్యగా మారింది. ఈ దేశానికి ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడే చరిత్ర ఉందని, మోసపూరిత విధానాలతోనే గతంలో రాబర్ట్ ముగాబే నాలుగు దశాబ్దాల పాటు అధికారంలో కొనసాగగలిగారని న్యూయార్క్ టైమ్స్ ఆరోపించింది. 2017లో జరిగిన తిరుగుబాటు వల్ల ముగాబే పదవిని కోల్పోయారు. మిత్రపక్షాలతో కలిసి మ్నాంగాగ్వా అధికారంలోకి వచ్చారు. అప్పట్లో జరిగిన ఎన్నికల్లో 50శాతం ఓట్లతో గెలిచారు. ఈ ఏడాది జరిగిన ఓటింగ్‌లో అవకతవకలు జరిగినట్లు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. బ్యాలెట్లను నిర్దేశిత సమయానికి తరలించడంలో ఎన్నికల కమిషన్ విఫలం కావడం పది గంటలకుపైగా జాప్యం జరగడం అనుమానాలకు తావిచ్చింది. ఛమీసా మద్దతుదారులు పోలింగ్ కేంద్రాల వద్ద రాత్రి సమయంలోనూ ఉన్నట్లు న్యూయార్క్ టైమ్స్ నివేదించింది. ఎన్నికల రాత్రి ప్రతిష్టాత్మకంగా ఎలక్షన్ వాచ్‌డాగ్స్‌కు చెందిన అనేక మంది సభ్యులను అరెస్టు చేసిన జింబాబ్వే పోలీసులను అంతర్జాతీయ సమాజం ఖండించారు. ఫలితాలను ప్రకటించకముందు ఎన్నికల పారదర్శకతను అనేక స్వతంత్ర విదేశీ పరిశీలక మిషన్లు ప్రశ్నించాయి.

సెబాస్టియన్‌ది అక్రమ అరెస్టు

తక్షణమే విడుదల చేయాలి

ఫ్రాన్స్ ప్రభుత్వానికి కార్మిక సంఘాలు, కమ్యూనిస్టుల డిమాండ్

పారిస్: సంస్కరణల నెపంతో కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న ఫ్రాన్స్‌లోని మాక్రాన్ ప్రభుత్వాన్ని ఆ దేశ కమ్యూనిస్టులు, కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దేశంలో శ్రామికులు, కార్మికులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కార్మిక సంఘాలపై దాడులు పెరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రభుత్వ నిరంకుశత్వాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చాయి. బెదిరింపులకు లొంగేది లేదని, దాడులను సహించబోమని తేల్చిచెప్పారు. పింఛన్ సంస్కరణలపై కార్మికోద్యమానికి సారథ్యం వహించిన గనులు, విద్యుత్ ఉద్యోగుల సమాఖ్య నాయకులు సెబాస్టియన్ మెనెస్ప్లయర్ అరెస్టును తీవ్రస్థాయిలో ఖండించాయి. ఆయనను బేషరతుగా విడుదల చేయాలని ఫ్రాన్స్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. సమ్మిళిత పోరాటానికి ఆయనను దోషిగా నిలబెట్టే ప్రయత్నాన్ని పాలకులు చేస్తున్నారని దుయ్యబట్టాయి. ఫ్రాన్స్‌లో కార్మిక సంఘాలపై దాడులు పేట్రేగాయని, కార్మిక సంఘాలు, ప్రగతిశీల ఉద్యమాలను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, సెబాస్టియన్ అరెస్టు ఇందులో భాగమేనని ఓ ప్రకటనలో వ్యాఖ్యానించారు. జనరల్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ (సీజీటీ) స్పందిస్తూ సెబాస్టియన్ అరెస్టు ఆక్షేపణీయమని పేర్కొంది. ఫ్రాన్స్ ప్రధాని ఎలిజబెత్ బోర్నేకు యూరోపియన్ ట్రేడ్ యూనియన్ కాన్ఫడరేషన్ (సీఈఎస్) ఓ లేఖ రాసింది. సెబాస్టియన్‌ఉ అక్రమంగా నిర్బంధించారని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని ఆయనకు విముక్తి కల్పించాలని కోరింది. ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీ (పీసీఎఫ్) కూడా సంఘీభావాన్ని ప్రకటించింది. కార్మికులంతా కలిసి చేసిన సమ్మెలకు ఓ ట్రేడ్ యూనియనిస్టును అరెస్టు చేయడం గతంలో ఎన్నడూ జరగలేదని పేర్కొంది. మాక్రాన్ ప్రభుత్వం నిరంకుశంగా తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక సంస్కరణలపై పోరులో విద్యుత్ కార్మికులు అగ్రభాగాన నిలిచినందుకు సెబాస్టియన్‌ను అధికారులు లక్ష్యంగా చేసుకున్నట్లు సీజీటీ తెలిపింది. సెబాస్టియన్‌పై దాడి చేయడమంటే కార్మికలోకంపై దాడి చేయడంతో సమానమని, పింఛన్ సంస్కరణలకు కొన్ని లక్షల మంది వ్యతిరేకించారని, సెబాస్టియన్‌ను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని కార్మికులు-కమ్యూనిస్టులు డిమాండ్ చేశారు.

అమెరికాలో జాత్యహంకార దాడి

నల్లజాతీయులపై కాల్పులు

దుండగుడు సహా నలుగురి మృతి

ఫ్లోరిడా: అమెరికాలో తుపాకీ సంస్కృతికి జాత్యహంకార దాడులు ఆగడంలేదు. తాజాగా ఫ్లోరిడాలో జరిగిన జాత్యహంకార దాడి ముగ్గురు నల్లజాతీయులను బలిగొంది. ఫ్లోరిడా, జాక్సన్ విల్లేలోని డాలర్ జనరల్ స్టోర్ వద్ద ఈ ఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు. దాడి అనంతరం దుండగుడు తనను తాను కాల్చుకున్నట్లు విలేకరుల సమావేశంలో జాక్సన్‌విల్లే షరీఫ్ టీకే వాటర్స్ వెల్లడించారు. దుండగుడు శ్వేతజాతీయుడని, నల్లజాతీయులంటే అతనికి గిట్టదని, అతనిలోని విద్వేషమే ఈ మరణాలకు కారణమని చెప్పారు. అయితే కచ్చితంగా ఎంతమందో చెప్ప లేదు. డాలర్ జనరల్ స్టోర్ చుట్టుపక్కల చర్చీలు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఘటనాస్థలికి దగ్గరలో చారిత్రక బ్లాక్ ప్రైవేట్ క్రిస్టియన్ స్కూల్ ఉంది. ఈ ఘటనను సెనేటర్ ట్రేసీ దావిస్ ఖండించారు. మన సమాజంలో ఇటువంటి హింస ఆమోదయోగ్యం కాదన్నారు. మృతులకు సంతాపాన్ని ప్రకటించిన ఆమె, బాధితుల కుటుంబాలను కలుస్తానని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 470 సామూహిక కాల్పుల ఘటనలు నమోదైనట్లు అధికారిక డేటా చెబుతోంది. 2013లో ఇటువంటి దారుణ పరిస్థితులే ఉన్నట్లు పేర్కొంది.

ఇంధనాన్ని మింగేశాడు!

(మొదటిపేజీ తరువాయి)

వివరాలు అందజేయలేదు. అదానీ అడిగిన డబ్బు చెల్లిస్తూ పోయారు తప్ప అంతర్జాతీయ మార్కెట్లో బొగ్గు ధర ఎంతో కనుక్కునే ప్రయత్నం కూడా గుజరాత్ విద్యుత్ విభాగం అధికారులు చేయలేదు. విద్యుత్ విభాగం గుజరాత్ ముఖ్య మంత్రి అధీనంలోనే ఉంది. ఆయనకు తెలియకుండా ఈ కుంభకోణం జరిగి ఉండదు. ముఖ్యమమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకే ఈ డబ్బు చెల్లించి ఉంటారు. అన్ని చోట్లా సోదాలు చేసే సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా కళ్లు మూసుకుంది. హిండెన్ బర్గ్ నివేదిక తరవాత గుజరాత్ ప్రభుత్వం మేలుకున్నట్టుంది. గుజరాత్ ప్రభుత్వం, అదానీ కుమ్మక్కు కాకపోతే ఈ కుంభకోణం జరగడానికి అవకాశమే లేదు. గుజరాత్ ప్రభుత్వం అదానీ ప్రభుత్వంగా మారిపోయినట్టుంది.

ఉమ్మడి జాబితాపై కేంద్రం కన్ను

(మొదటిపేజీ తరువాయి)

లైబ్రరీలను ఉమ్మడి జాబితాలోకి తీసుకొచ్చి, గ్రంథాలయాలను కూడా కాషాయీకరించే ఆలోచనలో కేంద్రం ఉన్నదనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

రాష్ట్రాల అధికారాలకు కోతవేసే విధంగా కూడా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఆర్థికపరమైన అంశాలతోపాటు అనేక విధాలుగా రాష్ట్రాలను వేధింపులకు గురిచేస్తూ, రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చేసేందుకు, రాష్ట్రాల అధికారాలలో చొరబడేందుకు ప్రయత్నం చేస్తోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. దేశ సమాఖ్య వ్యవస్థకు మోదీ సర్కార్ తూట్లు పొడుస్తున్నదనే విమర్శలు తీవ్రస్థాయిలో వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే బహుళ స్థాయి ఆపరేషన్‌ను ఎన్డీయే ప్రభుత్వం రూపొందించి, ప్రారంభించిందని చెపుతున్నారు. వ్యవసాయం, విద్య, సహకార వ్యవస్థ, నీరు, వైద్యం, గ్రంథాలయాలు, క్రీడలు తదితర అంశాల్లో రాష్ట్రాల అధికారాలకు కత్తెర వేసేలా ఎన్డీయే ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని విశ్లేషిస్తున్నారు. రాష్ట్రాల అధికారాల్లో కేంద్ర ప్రభుత్వ చొరబాటు యత్నానికి ఢిల్లీ సర్వీసెస్ చట్టమే తాజా ఉదాహరణ. అధికారుల నియామకం, బదిలీలకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను ఈ బిల్లు ద్వారా కేంద్రం లాక్కొన్నది. ఎన్నికైన ప్రభుత్వానికే పాలనాధికారాలు ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసినా, మోదీ సర్కార్ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

అందరి దృష్టి ఆ భేటీ పైనే...

(మొదటిపేజీ తరువాయి)

ఐక్యతకు, దేశాన్ని ఐక్యంగా ఉంచే శక్తిని ప్రతిబింబించేలా లోగో ఉంటుందని కొందరు నేతలు ఇప్పటికే చెప్పారు. ముంబైలో జరగబోయే మూడో భేటీలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. ముంబై శివార్లలోని గ్రాండ్ హయాత్ హోటల్‌లో ఈనెల 31, సెప్టెంబరు 1వ తేదీల్లో రెండు రోజులు జరగబోయే ఇండియా కూటమి సమావేశాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే లక్ష్యంతో 26 పార్టీలు 'ఇండియా కూటమి'గా ఏర్పడ్డాయి. మరిన్ని పార్టీలను కలుపుకుంటూ బలాన్ని పెంచుకుంటున్నాయి. ఇదే క్రమంలో ముంబైలో జరగబోయే మూడో భేటీ సందర్భంగా కొన్ని పార్టీలు చేరబోతుండటం ఈ కూటమిపై అంచనాలు పెంచుతోంది. ఎన్డీయే మిత్రపక్షాలు కొన్ని 'ఇండియా' వైపు మొగ్గు చూపుతున్నట్లు సంకేతాలు ఉండటంతో ఎన్డీయే వర్గీయులకు ముంబై సమావేశం ముచ్చెమటలు పట్టిస్తోంది. తొలుత బీహార్ రాజధాని పాట్నాలో ఆపై కర్నాటక రాజధాని బెంగళూరులో జరిపిన సమావేశాలతో బీజేపీ అగ్రనేతల వెన్నులో వణుకు మొదలైంది కాబట్టే బలప్రదర్శన ఉద్దేశంతో హడావిడిగా ఎన్డీయే పార్టీలు సమావేశం కావడం తెలిసిందే. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆదివారం పాట్నాలో విలేకరులతో మాట్లాడుతూ మరికొన్ని పార్టీలు ఇండియా కూటమిలో చేరబోతున్నట్లు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు సాధ్యమైనంత ఎక్కువ పార్టీలు కూటమిలో చేరడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తానేమీ పదవులను ఆశించడం లేదన్నారు. ఇండియా కూటమిలోకి కొత్త పార్టీలు ముఖ్యంగా ఈశాన్యం నుంచి చేరనున్నట్లు శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) నేత సంజయ్ రౌత్ కూడా ఇటీవల తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సీట్ల సర్దుబాటు ఇప్పటికే చాలా వరకు ఖరారు అయినట్లు కాంగ్రెస్ నేత మిలింద్ డియోరా అన్నారు. ఇండియా కూటమిలోని మిత్రపక్షాల మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యానికి మహారాష్ట్రయే ఉదాహరణ అని తెలిపారు. సీట్ల సర్దుబాటుతో పాటు సమన్వయ కమిటీల ఏర్పాటు, కూటమి కన్వీనర్ నియామకం వంటి అంశాలు ముంబై సమావేశంలో చర్చకు రావచ్చన్నారు. కాగా, ప్రతిపక్ష కూటమి సమావేశానికి సంబంధించి ప్రణాళికలు రూపొందించేందుకు అనేక కమిటీలను మహావికాస్ అగాధీలోని శివసేన (యూబీటీ),ఎన్సీపీ, కాంగ్రెస్ ఏర్పాటు చేశాయి. మీడియా, సోషల్ మీడియా వ్యవహారాలతో పాటు నాయకుల బస, రవాణా తదితర ఏర్పాట్లను ఈ కమిటీలు చూసుకుంటాయి. కూటమిలోని పార్టీల నాయకులు, ప్రతినిధుల కోసం గ్రాండ్ హయాత్ హోటల్‌లో 200కుపైగా గదులు బుక్ అయ్యాయి. కార్యక్రమాల పర్యవేక్షణను కాంగ్రెస్ నేతలు డియోరా, నసీం ఖాన్, వర్షా గైక్వాడ్ చూసుకుంటారు. నిర్వహణ కమిటీ ఇంచార్జిగా మాజీ సీఎం అశోక్ చవాన్ ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై సీఎం నిర్లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను పట్టించుకోకుండా తాడేపల్లి ప్యాలెస్‌కు పెద్ద మనిషిగా వ్యవహరిస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఎద్దేవా చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధం), ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) సంయుక్తంగా నిర్వహించిన అంగన్‌వాడీ సంఘాల రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయవాడ సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఈ సదస్సుకు అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే ప్రేమ, యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.భారతి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ... అంగన్‌వాడీ టీచర్లను ఎన్నికల విధుల్లో కూడా ఉపయోగించుకున్న సీఎం జగన్... వారి సమస్యలను పరిష్కరించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకోకుండా, ప్యాలెస్ నుంచి బయటకు రాకుండా కేవలం అధికారులు చెప్పిన అంశాలపైనే నిర్ణయాలు తీసుకోవటం సరికాదని హితవు పలికారు. ఇచ్చే మూరెడు జీతానికి బారెడు పని చేయించటమే కాకుండా దబాయించటం, భయపెట్టటం అధికారులకు,రాజకీయ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ చేసే పోరాటానికి ఏఐటీయూసీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరగాలంటే అంగన్‌వాడీ కేంద్రాలు, సిబ్బందిని పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు పీ ప్రసాద్ మాట్లాడుతూ... అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు వెట్టిచాకిరికి మారుపేరుగా నిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసవేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, పింఛన్ వంటి సౌకర్యాలు లేకుండా 48ఏళ్లుగా పని చేస్తున్నారని... వీరికి ప్రభుత్వం అన్ని విధాలుగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్ దగా చేశారని దుయ్యబట్టారు. అంగన్‌వాడీలు ఇతర సంఘాల మాదిరిగా ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని సూచించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక అనేక యాప్‌లతో పని భారం విపరీతంగా పెరిగిందన్నారు. అదనపు శ్రమ, మానసిక ఒత్తిడి, రాజకీయ వేధింపులు పెరిగాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీలను ఉపయోగించుకుంటున్నా... వారికి జీతాలు పెంచటానికి మనసు రావటం లేదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీలు మూతపడితే తద్వారా ప్రభుత్వ పాఠశాలలు కూడా మూతపడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ మాట్లాడుతూ గత ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి... తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా వేతనం ఇచ్చి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తానని హామీ ఇచ్చి... ఇప్పుడు మాట తప్పారని విమర్శించారు. అంగన్‌వాడీ వర్కర్స్‌ను ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌కు నిధులు పెంచి మరింత బలోపేతం చేయాలని కోరారు. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే 'చలో అసెంబ్లీ' ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వంపై దశలవారీ పోరాటానికి అంగన్‌వాడీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్ జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయటం లేదని దీనిపై ప్రశ్నిస్తే రాజకీయ బెదిరింపులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సెలవులు అడిగితే ఇవ్వటం లేదన్నారు. మినీ వర్కర్ పేరుతో వర్కర్ పని, హెల్పర్ పని ఒకరే చేయాల్సి వస్తుండటంతో పనిభారం పెరిగిందన్నారు.

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు బేబీరాణి, వెంకటేశ్వర్లు అంగన్‌వాడీ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, నాయకులు మంజుల, రాయలనేని హరికృష్ణ, కె.పోలారి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లు హాజరయ్యారు. ముందుగా అంగన్‌వాడీ వర్కర్స్ వారి సమస్యలను వివరిస్తూ పాటలు పాడారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ అతిథులకు స్వాగతం, వందన సమర్పణ చేశారు.

చంద్రుడిపై ఉష్ణోగ్రత లెక్క దొరికింది !



బెంగళూరు: చంద్రయాన్-3కు చెందిన ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రజ్ఞాన్ తమ పరిశోధనలను చంద్రుడిపై మొదలు పెట్టాయి. అక్కడి వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకుంటూ ఉష్ణోగ్రతల వివరాలను భూమికి పంపాయి. వీటి ఆధారంగా గ్రాఫ్‌ను భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) విడుదల చేసింది. చంద్రుడి ఉష్ణోగ్రతలను, దక్షిణ ధ్రువం చుట్టూ నేల పైపొర ఉష్ణోగ్రతలను విక్రమ్ ల్యాండర్‌లోని 'చంద్రాస్ సర్ఫేస్ థర్మో ఫిజికల్ ఎక్స్‌పరిమెంట్ (చాస్టే) పేలోడ్ కొలిచిందని ఇస్రో తెలిపింది. దీని ఆధారంగా చంద్రుడి ఉపరితలంపై థర్మల్ బిహేవియర్‌ను అర్థం చేసుకోవచ్చని వెల్లడించింది. ఎక్స్ మాధ్యమంగా చంద్రుడిపై ఉష్ణోగ్రతల సంబంధిత గ్రాఫ్‌ను విడుదల చేసింది. చాస్టే పేలోడ్ మొదటి పరిశోధన ఇదేనంటూ పేర్కొంది. నేలపై 10 సెంటీమీటర్ల లోతుకు వెళ్లి ఉష్ణోగ్రతలను కొలిచే సామర్థ్యం ఈ పేలోడ్ సొంతమని తెలిపింది. 10 స్వతంత్ర ఉష్ణోగ్రతల సెన్సర్లు ఈ పేలోడ్‌కు అమర్చి ఉన్నట్లు ఇస్రో వెల్లడించింది. చంద్రుడిపై ఉష్ణోగ్రతల్లో తేడాలను సూచిస్తూ గ్రాఫ్‌ను ట్వీట్ చేసింది.చంద్రుడి ఉపరితలంపై 50 డిగ్రీలు, 80 మిల్లీమీటర్ల లోతులో మైనస్ 10 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు గ్రాఫ్ చూపుతంది. కాగా, విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ)లోని స్పేస్ ఫిజిక్స్ ల్యాబరేటరీ (ఎస్‌పీఎల్) నేతృత్వంలో అహ్మదాబాద్‌కు చెందిన ఫిజికల్ రీసెర్చ్ ల్యాబరేటరీ (పీఆర్ఎల్) సంయుక్తంగా చాస్టే పేలోడ్‌ను రూపొందించారు. 'చంద్రయాన్-3' ఇప్పటికే రెండు లక్ష్యాలను పూర్తి చేసుకున్నట్లు ఇస్రో తెలిపింది.

డబుల్ ఇంజిన్... ఓ వైఫల్య సిద్ధాంతం

(మొదటిపేజీ తరువాయి)

దారుణ పరిస్థితులను తెలుపుతున్నాయన్నారు. అక్కడి విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టాలనే కుట్రలో భాగంగానే ఇదంతా జరిగిందని విమర్శించారు. మణిపూర్‌లో గంజాయి సాగుచేస్తుంటే దానికి మార్కెటింగ్ మాత్రం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్నారన్నారు. మణిపూర్ పర్యటన సందర్భంగా తమకు ఎదురైన ఘటలను ఈ సందర్భంగా నారాయణ వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో పేరుకే వైసీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఉన్నాయని, వాస్తవానికి ఇక్కడ కూడా డబుల్ ఇంజిన్ సర్కార్ నడుస్తున్నదన్నారు. వారి సీటును, వారి అక్రమ సంపాదనను కాపాడుకోవడానికి బీజేపీ ముసుగు తొడుక్కున్నాయన్నారు. బీజేపీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించే పార్టీలు సమాజానికి శత్రువులేనన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. కేంద్రంలో మోదీ ఎంత ప్రమాదమో తెలుగు రాష్ట్రాలలో జగన్, కేసీఆర్‌లు అంతే ప్రమాదమని, ఈ మూడు పార్టీలను ఓడించేలా సీపీఐ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని నారాయణ స్పష్టం చేశారు.

రాష్ట్రాభివృద్ధిని విస్మరించారు: రామకృష్ణ

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాభివృద్ధిని విస్మరించి తన సొంత అజెండాతో ముందుకు వెళుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఇంటి నుంచి తన కార్యాలయానికి వెళ్లాలంటే భయపడే పిరికిపందె జగన్ అని చెప్పారు. 1000 మంది పోలీసులు కాపలా లేనిదే బయటకు వచ్చే పరిస్థితి లేదని అన్నారు. గత 1349 రోజులుగా రైతులు రాజధాని అమరావతి కోసం దీక్షలు చేస్తుంటే సీఎంకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. తన నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్క రంగంలోనైనా అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. కొత్త పరిశ్రమలను తీసుకురాకపోగా ఉన్న పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమివేస్తున్నారన్నారు. ఉద్యోగ కల్పన లేదని, ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి కాలేదని, నేడు రైతులు వ్యవసాయాన్ని మానుకునే పరిస్థితి రాష్ట్రంలో దాపురించిందని చెప్పారు. ఐటీ ఎగుమతులలో ఏపీ వాటా కేవలం 0.14 శాతం మాత్రమేనని

ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదాయంలో కూడా తెలంగాణ రాష్ట్రం కంటే వెనుకబడి ఉన్నామని చెప్పారు. జగన్‌కు మోదీ, అమిత్ షా అంటే భయమని, రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక హోదా, విభజన హామీలు, కడప స్టీల్ ప్లాంట్ తదితర అంశాలను సాధించలేకపోయారని కనీసం వారిని అడగలేని స్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరాన్ని గాలికి వదిలేశారన్నారు. రూ.9 లక్షల కోట్ల అప్పును రాష్ట్రం నెత్తిపై పెట్టారని, మరోసారి జగన్‌కు అవకాశం ఇస్తే రాష్ట్రం అథోగతిపాలు అవుతుందని అన్నారు. ఇక మోదీ తన మత ప్రచారానికి చంద్రమండలాన్ని కూడా వదల్లేదని, చంద్రయాన్-3 దిగిన ప్రదేశాన్ని శివశక్తిగా నామకరణం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్య విలువలు మంటగొలుపుతున్నారు: ముప్పాళ్ల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య విలువలను మంటగొలుపుతున్నాయని, రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్వాతంత్రోద్యమ నేతలు ఏమి ఆశించి అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగాన్ని అందించారో ఆ స్ఫూర్తిని నేటి పాలకులు చంపేస్తున్నారని విమర్శించారు. వికలాంగులకు రూ.7 వేలు పెన్షన్ ఇవ్వాలని, అదేవిధంగా ఇతర పెన్షన్‌లు రూ.6 వేలు ఇవ్వాలని, వృద్ధులకు ప్రత్యేక ఆరోగ్య బీమా ప్రవేశపెట్టాలని తదితర డిమాండ్లతో భవిష్యత్తులో సీపీఐ ఉద్యమాన్ని కొనసాగించనుందని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాజన్న రాజ్యాన్ని మరిపిస్తానని వాగ్ధానం చేసి అధికారం చేపట్టిన జగన్ తాను చెప్పిందే శాసనం... తాను రాసిందే శాసనమని నియంతలా పాలిస్తున్నారని విమర్శించారు. పన్నులపై పన్నులు వేసి ప్రజల నడ్డివిరుస్తున్నారన్నారు. సంపదను కొల్లగొట్టి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని చెప్పారు.

ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ భుజం భుజం కలిపి రాబంధుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షులు జయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చైతన్యవంతులై దేశం నుంచి మనువాదులను తరిమివేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా విధానంలో తీసుకువస్తున్న సంస్కరణలతో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో కూడా అమలు జరగని నూతన జాతీయ విద్యావిధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలకు దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి వందనసమర్పణ చేశారు. సీపీఐ నగర నాయకులు రావుల అంజిబాబు స్వాగతంపలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు జాన్సన్ బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి, సివిల్ సప్లయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు, విద్యార్థి, యువజన, రైతు, కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పదవుల దుమారం

(మొదటిపేజీ తరువాయి)

విమర్శిస్తున్నాయి. జగన్ సర్కార్ హిందూ మతానికి కళంకం తెచ్చారంటూ ఆ పార్టీ నేతలు దుయ్యబడుతున్నారు.

ఢిల్లీ మద్యం కేసు అప్రూవర్‌కు చోటు

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో పట్టుబడి అప్రూవర్‌గా మారిన, అరబిందో గ్రూప్ డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డిని టీటీడీ పాలకమండలి సభ్యునిగా నియమించడంపై తీవ్రదుమారం నెలకొంది. ఈయన స్వయానా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి బంధువు. ఇటీవల ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో పట్టుబడి అప్రూవర్‌గా మారారు. అంతమాత్రాన ఆయన మంచివాడై పోతాడా ? అంటూ ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. తక్షణమే శరత్ చంద్రారెడ్డికితోపాటు జాబితాలో ఉన్న మరి కొందరు నేర చరిత్ర గల వారందరినీ మండలి నుంచి తొలగించి తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడాలని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెం నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి తదితరులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అధికార పార్టీ నుంచి స్పందన లేదు. ఇటీవల టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డిని అనూహ్యంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మండలి సభ్యుల నియామకం వరకు తిరుమల తిరుపతి దేవస్థానం వార్తల్లో నిలుస్తోంది. పాలకమండలి సభ్యుడుగా కృష్ణమూర్తి వైద్యనాథన్ నాలుగోసారి సభ్యత్వం సాధించారు. ఈయన చెన్నైకి చెందిన ఓ ఆడిటర్. టీటీడీ బోర్డు సభ్యుల కోసం కేంద్రంతోపాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై సిఫార్సుల ద్వారా ఒత్తిడి తెచ్చి పదవుల్ని సాధించినట్లు సమాచారం. ఇక రాష్ట్రంలోని వైసీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు చాలా మంది చైర్మన్‌తో పాటు బోర్డు సభ్యుడి పదవుల్ని ఆశించి, అవి దక్కకపోవడంతో అసంతృప్తి చెందుతున్నారు. తాము పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసినప్పటికీ, అధిష్ఠానం పదవుల్ని ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జంగా కృష్ణమూర్తి, శిద్దా రాఘవ అసంతృప్తి

టీటీడీ చైర్మన్‌గా వైసీపీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని నియమిస్తారని మొదట ప్రచారం జరిగింది. బీసీ సామాజికవర్గానికి చెందిన జంగా కృష్ణమూర్తి వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకైన పాత్ర వహిస్తున్నారు. ప్రధానంగా రాష్ట్ర వైసీపీ బీసీ సెల్ బాధ్యతలు నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 2019 ఎన్నికల సమయంలో ఏలూరు కేంద్రంగా జరిగిన బీసీ గర్జన సభ విజయవంతానికి ఆయన కీలక పాత్ర పోషించారు. దీన్ని గుర్తించిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్... జంగా కృష్ణమూర్తిని ఎమ్మెల్సీగా సభ వేదికగా ప్రకటించారు. అనంతరం రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడడంతో ఎమ్మెల్సీగా ఉన్న జంగా కృష్ణమూర్తిని మంత్రివర్గంలో తీసుకుంటారని ఆయన ఆశించారు. అదే ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన విడదల రజనీకి మంత్రివర్గంలో చోటు దక్కడంతో జంగా కృష్ణమూర్తికి ఎదురు దెబ్బ తగిలింది. అనంతరం టీటీడీ చైర్మన్‌గా జంగాకు అవకాశం కలుగుతుందని ఆశించినా పదవి దక్కలేదు. టీటీడీ చైర్మన్‌గా పనిచేయాలంటే ఎంతో కొంత అనుభవం ఉండాలనే దూర దృష్టితో, గతంలో పనిచేసిన ప్రస్తుత ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పేరును ప్రభుత్వం ఖరారు చేసింది. దీంతో తనకు చైర్మన్ పదవి వస్తుందని ఆశించిన జంగా కృష్ణమూర్తి భంగపాటుకు గురయ్యారు. ఈయనతోపాటు ప్రకాశం జిల్లా వైసీపీ నేత, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సైతం టీటీడీ చైర్మన్ పదవిని ఆశించారు. తనకు టీటీడీ చైర్మన్ పదవి ఇవ్వని పక్షంలో తన కుమారుడికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలనే ప్రతిపాదనను ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిని దృష్టిలో ఉంచుకుని శిద్దా రాఘవరావు కుమారుడైన శిద్దా సుధీర్‌కు మండలి సభ్యుడిగా నియమించి సరిపెట్టారు. దీంతో శిద్దా అనుచరులు సైతం అసంతృప్తితో ఉన్నారు.

తుంగభద్రలో తగ్గిన నీటి మట్టం

తప్పని తాగు-సాగు నీటి కష్టాలు
ఆందోళనలో రైతులు, ప్రజలు

విశాలాంధ్ర-హోలగుంద: కర్నాటక-ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడిగా ఉన్న తుంగభద్రలో నీరు అడుగంటిపోతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులో 350 క్యూసెక్కులే మిగిలి వున్నాయి. ఈమేరకు తుంగబోడు అధికారులు ఆదివారం తెలిపారు. ప్రాజెక్టు పై భాగంలోని మల్నాడు, శివమొగ్గ, దావణగిరే, మోరల్ తదితర భాగాల్లో వర్షాలు లేక డ్యామ్‌లో నీటిమట్టం తగ్గిపోయింది. గతేడాది డ్యామ్ పూర్తిస్థాయితో నిండి, 33 గేట్లను ఎత్తి తుంగభద్ర నదికి లక్షలాది క్యూసెక్కుల నీటిని అధికారులు వదలడంతో వరద నీటితో నది కళకళలాడింది. దీనితో నది పరివాహ ప్రాంతాల ప్రజలకు సాగు-తాగునీరు సంతృప్తికరంగా సరఫరా అయ్యేది. ఈ ఏడాది తుంగభద్ర పై భాగంలో వర్షాలు కురవక డ్యామ్‌లో ఇన్‌ఫ్లో పెరగక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15న తుంగభద్ర గేట్లను ఎత్తి వేసేవారు. ఈ ఏడాది డ్యామ్ పూర్తిస్థాయిలో నిండకపోవడంతో గేట్లను ఎత్తి వరద నీటిని తుంగభద్ర నదికి వదలలేదు. తుంగభద్ర డ్యామ్‌లో నీటి మట్టం తగ్గడంతో రైతులు, ప్రజలు సాగు, తాగునీటి కోసం ఇబ్బంది పడక తప్పలేదు. వర్షాలు కురువక కాలువ నీటిని ఆయకట్టుదారులు అక్రమంగా మళ్లించుకో వడంతో అప్రమత్తమైన అధికారులు పగలు,రాత్రి తమ సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నారు.తుంగభద్ర డ్యామ్ కింద లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతున్నాయి. డ్యామ్ పూర్తిస్థాయిలో నిండకపోవడంతో ఒక పంటకి మాత్రమే నీరు సరిపోతుంది. రెండో పంటకు నీరు అందదని ఆయకట్టు రైతులు దిగులు చెందుతున్నారు. వర్ష నీటిని నమ్ముకొని లక్షలాది రూపాయల విత్తనాలు చల్లి.. వర్షం కోసం ఎదురు చూస్తున్నామని, పొలాల్లో నాటిన పైర్లు ఎండకు ఎండిపోయి, పెట్టుబడి రాక ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు లేక ఎల్లార్తి సాగునీటి చెరువులు వేలవెలబోతున్నాయి. వేదవతి నదిలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గడంతో నది తీర ప్రాంతాల రైతులు సాగు, తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి తుంగభద్రా డ్యామ్ వేదవతి నది సాగునీటి చెరువులు నిండితే తప్ప ప్రజలు, రైతుల కష్టాలు తీరవు.

'హోస్పేట్' పైనే ఆశలు

విశాలాంధ్ర-కోసిగి: ఏడాది కిందట పరవళ్లు తొక్కిన తుంగభద్ర నదిలో ప్రస్తుతం నీరు అడుగంటిపోయింది. తీర ప్రాంతాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. నష్టాల్లో ఉన్న రైతాంగానికి వలసపోవడమే గత్యంతరమైంది. పత్తి పంట వేశాక ఎర్ర తెగులు రావడంతో రైతులు పొలం దున్నేయాల్సి వచ్చింది. అటు కర్నాటకలోని హోస్పేట్ ఆనకట్ట నుంచి దిగవకు నీరు వదలకపోవడం కూడా సమస్యగా మారింది. గతేదాది ఆగస్టులో తుంగభద్రలో లక్షల క్యూసెక్యుల నీరు ఉంది కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. హోస్పేట్ ఆనకట్ల నుంచి దిగువకు నీరు విడుదల చేస్తే నీటి కష్టాలు కొంతైనా తీరుతాయని స్థానికులు అంటున్నారు. కానీ అది జరగడం లేదు. దీంతో వర్షాలు లేక కరువు తాండవించే సీమలో నీటి కష్టాలు ఇంకా పెరిగాయి. హోస్పేట్ డ్యాం పైభాగంలో ఎగువభద్ర నిర్మాణం చేపడితే తుంగభద్రకు నీరు రాక నది ఎండిపోతుందని రాయలసీమ రైతులు, నాయకులు గళమెత్తారు. రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. ఆ ప్రాజెక్టు ముందుకు సాగితే ఎలాంటి పరిణామాలను ఎదుర్కొవల్సి రావచ్చన్నది ఇప్పుడే అర్థమవుతుంది. ప్రస్తుతం హోస్పేట్ ఆనకట్ట నుంచి ఎల్ఎల్సీ కాలువలకు మాత్రమే తాగు, సాగు నీరు అందుతోంది. దిగువ ఉన్న తుంగభద్రలో నీరు లేక రైతులు తల్లడిల్లిపోతున్నారు. నదీ తీర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. అటు మంత్రాలయంలో 352 సప్తరాత్రోత్సవాలకు వైభవంగా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి వచ్చే భక్తులకు తాగడానికి, స్నానాలకు నీరు ఇబ్బందికావచ్చు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, హోస్పేట్ ఆనకట్ల నుంచి దిగువకు నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హక్కుల సాధనకు ధైర్యంగా ఉద్యమించాలి

అనీరాజా పిలుపు

విశాలాంధ్ర-హైదరాబాద్: హక్కుల సాధన కొరకు ధైర్యంగా పోరాడాలని జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి అనీరాజా పిలుపునిచ్చారు. హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ లో ఆదివారం తెలంగాణ రెండవ ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి వనజ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లయినా ఇంకా మహిళలు అణిచివేతకు గురవు తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ ఎంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెండవ ఏఎన్ఎంలు అని పిలవటం ఏమిటని ఆమె ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. వివక్ష అనేది ప్రారంభంలోనే మొదలైందని... అది రూపుమాపే వరకు పోరాడాలని ఆమె అభిప్రాయ పడ్డారు. భయ పడుతూ పోరాడితే ఏదీ సాధించలేమని తెగించి పోరాడితేనే హక్కులు సాధించగలమన్నారు. పోరాటాన్ని అణచివేయటానికి ప్రభుత్వాలు ఎప్పుడూ ముందుం టాయని ఆ అణచివేతను దాటుకుని వెళితేనే విజయం వరిస్తుందన్నారు. మణిపూర్‌లో మహిళలు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూడటానికి వెళ్లిన తనను అరెస్ట్ చేసినప్పుడు తను భయపడలేదన్నారు. పోరాటం చేసేటప్పుడు అణిచివేత అరెస్టులు తప్పవని వాటికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. రెండవ ఏఎన్ఎంలు రెగ్యులర్ అయ్యేంతవరకు పోరాడాలని ఆ పోరాటానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు. ఏఐటీయూసీ జాతీయ నాయకురాలు బీవీ విజయలక్ష్మి మాట్లాడుతూ 103 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐటీయూసీ అధ్వర్యంలో ఎందరో పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించారని గుర్తు చేశారు. శ్రామిక మహిళలకు సంబంధించిన హక్కుల చట్టాలు రావటా నికి కారణం కేవలం ఏఐటీయూసీనే అని తెలిపారు. ఈ జెండా నీడలో పోరాడుతున్న మీరు కచ్చితంగా విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రాష్ట్ర నాయకులు తోట రామాంజనేయులు, తెలంగాణ రెండవ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి ఉత్తుత్తి హామీలు

మంత్రి కారుమూరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబువి అన్నీ ఉత్తుత్తి హామీలని, వాటిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మూడుసార్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏం చేశారని ప్రశ్నించారు. ఓ పక్క రాష్ట్రాన్ని శ్రీలంకలా తయారు చేస్తున్నారని, అప్పుల పాలైపోయిందని విమర్శిస్తూనే... తమ ప్రభుత్వ పథకాల కంటే ఎక్కువ ఇస్తానని చంద్రబాబు అంటున్నారని, వాటికి డబ్బులు ఎక్కడ నుంచి తెస్తారని ప్రశ్నించారు. చంద్రబాబువి అన్నీ అబ్రకదబ్ర మాటలంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో దళారీ వ్యవస్థ లేకుండా రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఐదేళ్లలో (చంద్రబాబు హయాంలో) రైతుల దగ్గర నుంచి 17.94 లక్షల రైతుల నుంచి 2.65 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసి రూ.40,236 కోట్ల చెల్లింపులు చేశారని, ఈ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వ హయాంలో 32.78 లక్షల రైతుల నుంచి 3.10 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.58,765 కోట్ల చెల్లింపులు చేశామని స్పష్టం చేశారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వాటిని జీర్ణించు కోలేక చంద్రబాబు, ఆయనకు వత్తాసు పలికే మీడియాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. చంద్రబాబు ఎంత దుర్మార్గం చేశారో, రైతులకు తెలుసని, నాడు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని చెప్పారు. రైతులందరికీ జగన్ మేలు చేస్తుంటే, రైతులకు దగా అంటూ దుష్ప్రచారం చేయడాన్ని తప్పుపట్టారు. మీడియా ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ నయవంచనకు కేరాఫ్ చంద్రబాబు అని ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు వెన్నుపోట్లు పొడిచే మనిషి అని, చివరికి టీడీపీని, ఆ పార్టీ బ్యాంక్ బ్యాలెన్స్‌ను దుర్మార్గంగా దోచుకున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు, లోకేశ్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబాటు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-నరసరావుపేట: కేంద్రంలోని ఎన్డీయే తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిందనీ, ప్రధాని నరేంద్ర మోదీ విఫల పీఎం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ బస్సు యాత్ర ఆదివారం నరసరావుపేటకు వచ్చిన సందర్భంగా రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కేంద్రంలో మరోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకొస్తే లౌకిక రాజ్యాంగాన్ని కలరాసి మనుస్మృతి ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించి అమలు చేస్తారని అన్నారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో నరేంద్ర మోదీ మతం అజెండాగా వెళ్తున్నారని, బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. 2014 ఎన్నికల ముందు దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని తొమ్మిది సంవత్సరాల పాలనలో ఎలాంటి సమస్యలు పరిష్కరించలేకపోయారని చెప్పారు. దేశంలో మత విద్వేషాన్ని రెచ్చగొడుతూ పాలన సాగిస్తున్నారన్నారు. బ్లాక్ మనీ, లంచగొండితనం, ఇతర సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. శాస్త్రవేత్తల శ్రమతో చంద్రయాన్-3 విజయవంతమైందని, చంద్రయాన్ ల్యాండ్ అయిన ప్రాంతానికి నరేంద్ర మోదీ శివశక్తిగా నామకరణం చేయటం మతతత్వానికి పరాకాష్ట అన్నారు. దేశంలో అంబేద్కర్ రాజ్యాంగానికి ప్రధాని మోదీ తూట్లు పొడుస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో దివాలాకోరు ప్రభుత్వం నడుస్తోందని, రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆర్థిక వ్యవస్థ సవ్యంగా ఉందని చెప్పడం దారుణం అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నిరోధక వైఖరిని సీఎం జగన్ అవలంబిస్తున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు తేవడంలో విఫలమయ్యారని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ పై మాట్లాడటం లేదని, కేసుల మాఫీ కోసం కేంద్రం చుట్టూ ముఖ్యమంత్రి తిరుగుతున్నారని రామకృష్ణ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గళం విప్పేందుకు సీపీఐ ఆధ్వర్యంలో దేశాన్ని కాపాడండి - రాష్ట్రాన్ని రక్షించండనే నినాదంతో ఈ నెల 17వ తేదీ నుంచి విశాఖ నుంచి బయలుదేరిన బస్సు యాత్ర 26 జిల్లాల్లో పర్యటిస్తుందని అన్నారు. తమ బస్సు యాత్రకు ప్రజల నుంచి ఘన స్వాగతం లభిస్తుందని రామకృష్ణ చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఢిల్లీకి ఎన్టీఆర్ కుటుంబీకులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత రాష్ట్రపతి చేతుల మీదుగా సోమవారం రాష్ట్రపతిభవన్‌లో ఎన్టీఆర్ వంద రూపాయల నాణం విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకుగాను ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు ఢిల్లీకి చేరుకున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆయన కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానాలు పంపింది. అటు టీడీపీ అధినేత చంద్రబాబు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఢిల్లీ చేరుకున్నారు. ఎన్టీఆర్ కుమారులు, కుమార్తెలతోపాటు వారి కుటుంబ సభ్యులతో పాటు జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్ కూడా హాజరు కానున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యులతోపాటు ఎన్టీఆర్‌తో పరిచయం ఉన్న ప్రముఖులకు సైతం ఈ కార్యక్రమానికి ఆహ్వానాలు అందినట్లు తెలిసింది. నాణెం విడుదల కార్యక్రమం అనంతరం... ఏపీలో దొంగ ఓట్ల వ్యవహారంపై చంబ్రాబు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నారు.

15న విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల ధర్నా

విశాలాంధ్ర-ఏలూరు: అగ్రిగోల్డ్ బాధితులు సెప్టెంబర్ 15వ తేదీన విజయవాడలో భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజకీయపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యర్రా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో అగ్రిగోల్డ్ బాధితులు 230 మంది ఆత్మహత్య చేసుకున్నారని వీరికి అప్పటి ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించగా...ఆనాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ తాను అధికారం చేపట్టిన 7 రోజుల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయినా బాధితుల సమస్యను పరిష్కరించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత 4 సంవత్సరాల కాలంలో అగ్రిగోల్డ్ బాధితులు 600 మంది ఆత్మహత్య చేసుకున్నారని మరణించిన కుటుంబాలకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు అండగా సీపీఐ మొదట్నుంచీ ఉద్యమాలు, పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటోందని చెప్పారు. సెప్టెంబర్ 15వ తేదీన విజయవాడలో జరిగే ధర్నాలో అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ బాధితుల డిపాజిట్ సొమ్ము అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ కంటే తక్కువగా ఉందని, ప్రభుత్వం జోక్యం చేసుకొని అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం చేయాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ సీపీఐ అండగా ఉండి పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొంటుందని తెలిపారు. సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి అరటికట్ల రవి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సమస్య 8 రాష్ట్రాల సమస్య అన్నారు. రాష్ట్రంలో వైసీపీ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బాధ్యత తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ కేవలం సంక్షేమ పథకాల బటన్ నొక్కడం కాదని, అగ్రి గోల్డ్ బాధితుల సొమ్ము చెల్లించడానికి కూడా బటన్ నొక్కాలన్నారు. అసోసియేషన్ పోరాటాలకు సీపీఎం అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులు స్వాధీనం చేసుకొని బాధ్యులకు న్యాయం చేయాలన్నారు. అన్ని రాజకీయ పక్షాలు ఏకమై బిజెపిని నిలదీయాలన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బీజేపీ నాయకుడు నాగం శివ, జనసేన నాయకుడు శ్రావణ్ కుమార్ గుప్తా, అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు సీహెచ్ జగన్మోహనరావు, ఏవీ రాంబాబు, షేక్ మస్తాన్, శివ ప్రసాద్, సూర్యనారాయణ, సత్యనారాయణ, అడ్డగర్ల లక్ష్మి ఇందిర తదితరులు ప్రసంగించారు. తొలుత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు వివిధ పక్షాల నాయకులను వేదిక పైకి ఆహ్వానించారు. ఇటీవల మరణించిన అగ్రిగోల్డ్ ఏజెంట్ శివలెంక వెంకట భవాని శారదకు సమావేశం సంతాపం తెలిపింది.

నేడు విద్యుత్ ఉద్యమ అమరులకు నివాళి

సభలు, సమావేశాలకు వామపక్షాల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాటి తెలుగుదేశం ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు, ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన కార్యకర్తలు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి 23వ వర్థంతి సందర్భంగా నివాళి కార్యక్రమాలు, సభలు, సదస్సులను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిం చాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. ఈ మేరకు ఆదివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. అందులో భాగంగా ఈనెల 28వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద అమరవీరులకు నివాళు లర్పిస్తారు. దీనికి వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు దోనేపూడి శంకర్ (సీపీఐ), సీహెచ్.బాబూరావు (సీపీఎం) తదితరులు హాజరవుతారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చినప్పటికీ... నేటికీ సీఎం జగన్ విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా 100 శాతం పెంచారని వామపక్షాలు ధ్వజమెత్తాయి. ఈ క్రమంలో విద్యుత్ అమరవీరులను స్మరించుకోవడం మరింత అవసరమని, ఈ కార్యక్రమంలో విద్యుత్ చార్జీలను వ్యతిరేకించే ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి.

కట్టా హేమసుందరరావుకు సత్కారం

విశాలాంధ్ర-పెడన: ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభ విశాఖపట్నం గాజువాక టి ఎస్ ఆర్ కళ్యాణమండపంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని చేనేత నాయకులు అందరూ పాల్గొన్నారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు ఫెడరేషన్ రాష్ట్ర గౌర వాధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, చేనేత నాయకులు బందారు ఆనంద్ ప్రసాద్, ఉప్పు రాజారావు తదితరులు కట్టా.హేమ సుందరావును ఘనంగా సత్కరించారు.

అల్లర్లకు టీడీపీ కుట్ర: విజయసాయిరెడ్డి

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి తద్వారా ప్రాణ నష్టం జరగాలని చంద్రబాబు, ఆయన ముఠా భావిస్తోందని, ప్రస్తుతం అదే పనిమీదే వారు దృష్టి కేంద్రీకరిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి ఆరోపించారు. టీడీపీ కుట్రలకు ప్రజలే జవాబు చెబుతారన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆదివారం వివిధ అంశాలపై ఆయన స్పందించారు. రాజకీయాల్లో హుందాగా నడుచుకునే వారి మాటలకే సమాజంలో గౌరవం ఉంటుందని, ఒకప్పటి రౌడీషీటర్లు, చిల్లర నేరగాళ్లు హెచ్చరికలు జారీ చేస్తే వీధి కుక్కలు కూడా భయపడబోవన్నారు. పుష్ప జాతీయ అవార్డుకు చంద్రబాబే కారణమంటున్నారని ఎద్దేవా చేశారు. మూలధన వ్యయంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచిందని, కేవలం నాలుగు నెలల్లోనే మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో 47.79 శాతం వ్యయం జరిగినట్లు విజయసాయి రెడ్డి వివరించారు.

బస్సు షెల్టరే కట్టలేని వాళ్లు రాజధాని ఎలా నిర్మిస్తారు?

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రచార ఆర్భాటాల కోసం ప్రజా ధనాన్ని నాశనం చేస్తున్నారంటూ సీఎం జగన్‌పై టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మండిపడ్డారు. విశాఖలో ఆదివారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో దక్షిణం వైపు జీవీఎంసీ కొత్తగా నిర్మిస్తున్న బస్సు బే ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో విపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. నవరత్నాల చిహ్నంతో సీఎం జగన్ ఫోటో కోసం ప్రచార ఆర్భాటంగా నిర్మిస్తున్న బస్ షెల్టర్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు గాలికి వదిలేశారంటూ గంటా ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. బస్ బే కట్టడం...కూలడం రెండూ జరిగాయన్నారు. ఒక చిన్న బస్ షెల్టర్‌నే సక్రమంగా కట్టలేని వాళ్ళు... రాజధాని, పోలవరం కట్టేస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని, ఇక ప్రజలు బై జగన్, బై బై జగన్ అని చెప్పాల్సిన సమయం వచ్చేసిందన్నారు. విశాఖ నగరంలో దాదాపు 20 బస్టాపులకు పైగా ఒక్కొక్కటి రూ.40 లక్షలు వ్యయంతో మీరు నిర్మించిన మోడల్ బస్‌షెల్టర్ నాలుగు రోజులకే కుప్పకూలింది... ప్రచారాలకు తప్ప, అభివృద్ధి, నిర్మాణాలకు పనికిరాని ప్రభుత్వమని మరోసారి నిరూపితమయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బస్సులు తిరగడానికి సరైన రోడ్డులు లేవు కానీ, మీ ప్రచార ఆర్భాటాల కోసం ఇలా ప్రజా ధనాన్ని నాశనం చేస్తున్నారన్నారు. తుమ్మితే వూడే ముక్కు చందంగా మారిన బస్‌షెల్టర్లు కోసం గ్రీన్‌బెల్ట్‌లోని దశాబ్దాల కాలం నాటి భారీ వృక్షాలను విచక్షణారహితంగా నరికేసుకుంటూ పోయారన్నారు. నగరంలో కొన్నిచోట్ల ఏడాది కిందటే లక్షలాది రూపాయలు వెచ్చించి బస్ షెల్టర్‌లను నిర్మించారని, దృఢంగా ఉన్న ఆ బస్ షెల్టర్లను కూడా పూర్తిగా తొలగించి.. వాటి స్థానే ఇలాంటి నాసిరకం బస్‌షెల్టర్లు నిర్మించి... ప్రజా ధనాన్ని వృధా చేస్తూ, ప్రజల ప్రాణాలతో ఆడుకోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అంతా గమనిస్తూనే ఉన్నారని, మీ ప్రచారాల ప్రభుత్వం కూడా కూలిపోయే రోజు కూడా దగ్గరలోనే ఉంది జగన్మోహన్ రెడ్డి... అని గంటా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క టీడీపీ శ్రేణులు బస్ బే కూలడంపై ప్రత్యక్ష ఆందోళనకు దిగాయి. అటు జనసేన, సీపీఎంతో పాటు అనేకమంది బస్సు షెల్టర్ కూలిపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు.

వచ్చే ఎన్నికల్లో గెలిచేది బీజేపీనే: అమిత్ షా

విశాలాంధ్ర-ఖమ్మం: రజాకార్ల పార్టీ ఎంఐఎంతో కొనసాగుతున్న కేసీఆర్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విమర్శించారు. ఖమ్మంలో తెలంగాణ బీజేపీ నిర్వహించిన రైతు గోస-బీజేపీ భరోసా సభలో ఆయన మాట్లాడారు. రజాకార్లతో కేసీఆర్ రాజీ పడ్డారని, ఒవైసీతో కలిసి తెలంగాణ పోరాట యోధులను కేసీఆర్ విస్మరించారని పేర్కొన్నారు. కేసీఆర్ పక్కన ఒవైసీ ఉన్నారన్న సంగతి అందరికీ తెలిసిందేనని స్పష్టం చేశారు. కారు స్టీరింగ్ ఒవైసీ చేతిలో ఉందని, ఒవైసీ నడిపే కారు పార్టీని మళ్లీ గెలిపించవద్దని పిలుపునిచ్చారు. కేసీఆర్ సర్కారుకు తిరోగమనం ప్రారంభమైందని అన్నారు. కేసీఆర్, ఒవైసీలతో బీజేపీ కలిసే ప్రసక్తే లేదని అమిత్ షా ఉద్ఘాటించారు. ఒవైసీతో బీజేపీ కనీసం వేదికను కూడా పంచుకోదన్నారు. అరెస్టులతో బీజేపీ నేతలను భయపెట్టవచ్చని కేసీఆర్ భావిస్తున్నట్టుందని, బీజేపీ శ్రేణులు అలాంటి వాటిని లెక్కచేయవని అన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్‌లను అరెస్టులతో భయపెట్టాలని చూశారని తెలిపారు. కేసీఆర్ ధాన్యం కొనుగోలుపైనా రాజకీయాలు చేస్తున్నారని అమిత్ షా మండిపడ్డారు. మోదీ సర్కారు 9 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని, ఈసారి తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వికసించేది కమలమేనని అన్నారు. ఈసారి సీఎం అయ్యేది కేసీఆర్ కాదు, కేటీఆర్ కాదు అని స్పష్టం చేశారు. తెలంగాణలో ఈ పర్యాయం ముఖ్యమంత్రి అయ్యేది బీజేపీ నేత మాత్రమేనని అమిత్ షా ధీమాగా చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కుటుంబ పార్టీలేనని.... సోనియా కుటుంబం కోసం కాంగ్రెస్ పనిచేస్తుంటే, కల్వకుంట్ల ఫ్యామిలీ కోసం బీఆర్ఎస్ పనిచేస్తోందని అమిత్ షా విమర్శించారు. కాంగ్రెస్ 4జీ పార్టీ అయితే, బీఆర్ఎస్ 2జీ పార్టీ అని, ఎంఐఎం 3జీ పార్టీ అని ఎద్దేవా చేశారు. కేసీఆర్, బీజేపీ ఏకం అవుతాయని ఖడ్గే అబద్ధాలు చెపుతున్నారని అమిత్ షా మండిపడ్డారు.

ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

జిల్లా కేంద్రాల్లో ఏపీటీఎఫ్ ధర్నాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగ బదిలీలు జరిగి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ జీతాలు చెల్లించకపోవడం శోచనీయమని, తక్షణమే ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలని డిమాండు చేస్తూ, ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఏపీటీఎఫ్ ధర్నాలు, నిరసనలు చేపట్టింది. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జీ.హృదయరాజు కర్నూలు జిల్లాలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొనగా... రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి చిత్తూరులో, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఏ.సదాశివరావు విజయనగరంలో జరిగిన నిరసన కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు మాట్లాడుతూ, గతంలో అనేక సార్లు బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియలు చేపట్టినా వేతనాలు ఇవ్వకుండా ఉన్న సందర్భం లేదన్నారు. ఇప్పటికైనా మూడు నెలల వేతనాలను తక్షణమే చెల్లించకుంటే ఆందోళన కార్యక్రమాల్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మెతుకును బతికించండి

ఆశలు తడిసి పోతున్నాయి
ఆశయాలు ఎండిపోతున్నాయి
గింజలు అవిసిపోతున్నాయి
కళ్ళాలు ఎక్కిరిస్తున్నాయి
బతుకులు కుళ్ళి పోతున్నాయి
జీవితాలు కుంగిపోతున్నాయి

అకాల క్రూర మేఘుడు
ఆరుగాల శ్రమను సంకనేసుకొని పోయాడు.

అప్పుకోసం తాకట్టు పెట్టిన పుస్తెలు
అందనంత లోతుల్లోకి జారిపోయాయి.

మట్టి మనుషుల
ఆత్మగౌరవ కవచం దహించుకుపోయి
ఆత్మదహనం ఆరంభం అయ్యింది.
కష్టాన్ని కొల్లగొట్టడానికి
ఎదురుచూస్తున్న దళారి గద్దను చూసి
తడిచిన గింజలు వణికి పోతున్నాయి.

అందీ అందని ప్రభుత్వ సాయం
అంతే చిక్కని ప్రకృతి జాలం
రైతు మెడకు అదృశ్య ఉరులు పేనుతున్నాయి.

పరామర్శ పేరుతో ఫోజులిచ్చి
రాజకీయ వ్యాపారులు కుమ్మరించే సానుభూతి
పతాక శీర్షికలై భయపెడుతోంది.

కష్టానికి - ఫలితానికి మధ్య
ఏర్పడుతున్న అఘాతం
వ్యవసాయానికి రైతును కానివాణ్ణి చేస్తోంది.

ఇక మెతుకులే తనువులు చాలిస్తే
గ్లోబల్ అంగట్లో మానవ కళేబరాలు
తలకిందులుగా వేలాడుతాయి.

మట్టిని రొట్టెగా చేసి మనుషులకు ప్రాణం పోస్తున్న
రైతన్న శ్రమకు తగ్గ
ఆర్థికవాటా ఎంతో ఇప్పటికైనా తేల్చండి
నాలుగువేళ్ళు నోట్లోకి వెళ్ళే పరిస్థితి కల్పించండి
లేకుంటే
భూమిపై పండే ఆకలి శవాల కోసం
సామూహిక స్మశాన వాటికలను సిద్ధం చేసుకోండి.

ఆచార్య ఎన్ ఈశ్వరరెడ్డి, అధ్యక్షులు
అరసం, కడపజిల్లా శాఖ, 8328296952

సాహితి

మహాసభలో పుస్తకావిష్కరణ దృశ్యం

మహాసభల ప్రారంభంలో జెండా ఆవిష్కరణ

అక్షరానికి పదును పెట్టాలి

మోతుకూరి అరుణకుమార్
కార్యవర్గ సభ్యులు, అరసం ఆంధ్రప్రదేశ్
99480 24789

అరసం సాహిత్య సంస్థను దేశ వ్యాప్తంగా బలోపేతం చేయాలని, నేటి పరిస్థితులను ప్రజలకు తెలయజేసేందుకు, చైతన్యపరిచేందుకు రచనలు చేయాలని మధ్యప్రదేశ్‌లోని జబల్పూరులో జరిగిన అరసం జాతీయ మహాసభలు నిర్ణయిం చాయి. అరసం అఖిలభారత 18వ మహాసభల్లో తీర్మానాలు. సమాజ ప్రగతిని కోరుకునే రచయితలకు రక్షణ కల్పిస్తూ స్వేచ్ఛను కల్పిం చాలని, మణిపూర్ రాష్ట్రంలో సాగుతున్న హింసాత్మక ఘటనలు నివారించి, శాంతిని నెలకొల్పడంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి, జబల్ పూర్ పట్టణంలో నిర్మితమవుతున్న అణు కర్మాగారం తక్షణమే నిలిపివేయాలి. విద్యా వ్యవస్థలో పాఠ్యపుస్తకాల్లో మనువాద కాషాయకరణ ను అడ్డుకోవాలి. దేశాన్ని ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం,మతోన్మాదం, ఫ్యాసిస్టు దొరణులు, అవినీతి వెంటాడుతు న్నాయి. ఇటీవల మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండ మరింత వేడెక్కింది. ప్రగతిశీల శక్తులు, రచయితలు, మేధావులు ప్రశ్నించే వారిపై భౌతిక దాడులు, అక్రమ నిర్బంధాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రచయితలు తమ అక్షరానికి మరింత పదును పెట్టవలసిన ఆవశ్యకత ఉంది. ఆనాటి దేశ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో 1936 ఏప్రిల్ 10 న లక్నోలో ఆవిర్భావం జరిగిన అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భావం జరిగింది. చిరకాలంగా యధాతద వాదుల చేతుల్లో పడి కునారిల్లుతున్న సాహిత్యాన్ని, కళలను పరిరక్షించి, వాటిని ప్రజలకు చేరువ చేయడం వాటిని జీవిత వాస్తవిక చిత్రీకరణకు ఉపయోగించే కీలకమైన ఉపకరణాలుగా మార్చడం, మనం ఆకాంక్షిస్తున్న భవిష్యత్తు వైపు నడిపించడం, ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం పోరాటం వంటి లక్ష్యాలను పేర్కొన్నారు. 1943 లో ముంబైలో 1980 లో జబల్‌పూర్‌లో నూతన ప్రణాళికలు రూపొందించారు.

కాగా మళ్ళీ ఈనాడు 18వ జాతీయ మహాసభలకు జబల్‌పూర్ పట్టణం వేదిక అయింది. ఈ నెల 20,21,22 లలో మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జరిగాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తూ దాదాపుగా నాలుగు వందల పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఉత్తర భారతదేశంలో జరగడం వల్లనో ఏమో గానీ

పెనుగొండ లక్ష్మీనారాయణ
అరసం జాతీయ అధ్యక్షుడు

ఏదైనా కావొచ్చు హిందీ బాషలోనే అధ్యంతమ్ కొనసాగాయి. క్యూబా దేశం నుండి కూడా సౌహార్ధ ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభ ప్రతినిధులలో మహిళలు, యువ రచయితలు ఉన్నప్పటికీ అధికంగా వయస్సు అరవై ఏళ్ల పై బడిన వాళ్ళే ఉన్నారు.

1932 లో ఆనాటి ఉర్దూ హిందీ రచయితలు అహ్మద్ ఆలి, సజ్జాద్ జహీర్, రషీద్ జహాన్, మహమ్మద్ ఉన్ జాఫర్‌లు తొమ్మిది కథానికలు, ఒక ఏకంకికతో వెలువరించిన అంగారే అనే ఆధునిక అభ్యుదయ భావాల సంపుటిని ఆనాటి యునైటెడ్ ప్రావిన్స్ ప్రభుత్వం నిషేధం విధించింది. ఆ రచయితలు క్షమాపణ చెప్పడానికి నిరాకరించారు. లండన్‌లో జహీర్ నేతృత్వంలో సాహిత్య బృందాన్ని ఏర్పాటు చేశారు.

అందులో మహిళలు కూడా ఉన్నారు. లండన్‌లో భారతీయ అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటు చేయాలని ఆకాక్షించారు. లండన్ కేం బ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చదివిన వారే ఎక్కువగా ఉన్నారు. 1934 లో ఏర్పాటు అయిన సమావేశంలో ముల్క్‌రాజ్ ఆనంద్ అధ్యక్షునిగా, సేన్ గుప్తా కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

1935లో ప్యారిస్‌లో జరిగిన అంతర్జాతీయ రచయితల సంఘం మహాసభల్లో ముల్క్‌రాజ్ ఆనంద్ హాజరయ్యారు. అక్కడే గోర్కీ, రాల్ ఫా క్రిస్టోఫర్ తదితర అంతర్జాతీయ రచయితలు పాల్గొన్నారు. దేశ విభజనకు ముందు స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్ర చాలా గొప్పది. అరసం చరిత్రలో ఎక్కువ భాగం హిందీ, ఉర్దూ ఎక్కువగా కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి 25 మంది పాల్గొన్నారు. మణిపూర్ దుర్ఘటనల ఆధారంగా నిర్వహించిన కవితలతో కూడిన ద్విభాషా సంకలనం "మణిపూర్ మంటలు" తో పాటు "అక్షరమా నీకు వందనం" పుస్తక ఆవిష్కరణలు జరిగాయి. ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో శ్రీ శ్రీ, గురజాడ, కందుకూరి, చలం, తాపీ ధర్మారావు వంటి వారు అందించిన అభ్యుదయ భావజాలాన్ని ముందుకు తీసుకు వెళ్ళవలసిన ఆవశ్యకత ఉంది. ప్రపంచీకరణ ప్రభావంతో అంతరించి పోతున్న తెలుగు భాష, సంస్కృతిని కాపాడుకోవలసిన బాధ్యత అందరి పైనా ఉంది. తొలి రోజున సంఘం పూర్వ అధ్యక్షుడు రాజేంద్ర రాజన్ అరసం పతాకాన్ని ఆవిష్కరించారు. ఫోటో ప్రదర్శనను విభూతి నారాయణ్ ప్రారంభించారు. తొలి రోజున జబల్‌పూర్ పట్టణంలో రచయుతలు, కళాకారుల బహిరంగ ప్రదర్శన జరిగింది. రాష్ట్రాల వారీగా హాజరైన ప్రతినిధులు వారి వారి ప్రాంతాల సమస్యలతో కూడిన ప్ల కార్డులు, బ్యానర్‌లు పట్టుకున్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. "రాజ్యాంగ పరిరక్షణ,పరి వ్యాప్తిలో ఎదుర్కొంటున్న ప్రమాదాలు, సవాళ్లు", "దోపిడీ సమాజాన్ని ఎండగట్టడంలో సాహిత్య సాంస్కృతిక కృషి", "మెరుగైన సమాజం నిర్మాణంలో సాహిత్య పాత్ర" వంటి అంశాల పై సదస్సులు, చర్చలు జరిగాయి. కాగా గత నలభై ఏళ్లుగా తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తూ ఉన్న పెనుగొండ లక్ష్మీనారాయణ జాతీయ అధ్యక్షునిగా ఎన్నికవడం తెలుగు రాష్ట్రాలకు ఎంతో గర్వకారణం. అలాగే జాతీయ కార్యదర్శిగా తెలంగాణ రాష్ట్రం నుండి వేల్పుల నారాయణ, కార్యవర్గ సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ నుండి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, వల్లూరు శివప్రసాద్‌లు ఎన్నికయ్యారు.

మహాసభలలో జాతీయ ప్రధాన కార్యదర్శి శుఖ్ దెవ్ సింగ్ సీర్సా, కార్యదర్శి వినీత్ తివారీలు తమ బుజాల మీద వేసుకుని ఘనంగా నిర్వహించారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికి, పాలక బిజెపి ప్రభుత్వం ఉన్న మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో అనుకూల వాతావరణంలో నిర్వహించడం గర్వించదగ్గ విషయమే.

(అరసం జాతీయ మహాసభలు సమీక్ష)

శ్రీశ్రీ రచించిన ఖడ్గ సృష్టి
సంకలనం కవితలో కొంత భాగం

ఏమో బహుశా త్వరలో
మీ ఇంటికే రావచ్చు మేము
స్వాగతం ఇస్తావు కదూ
ఆతిథ్యాని కర్హులమే మేము
చంద్రమండలానికి ప్రయాణం
సాధించరాని స్వప్నంకాదు
గాలికన్న బరువైన వస్తువుని
నేల మీద పడకుండా నిలబెట్టలేదూ?
పరమాణువు గర్భంలోని
పరమ రహస్యాలూ
మహాకాశ వాతావరణంలోని
మర్మాలూ తెలుసుకున్నాక
సరాసరి నీ దగ్గరకే
ఖరారుగా వస్తాంలే
అప్పుడు మా రాయబారుల్ని
ఆదరిస్తావు కదూ నువ్వు?

ఒచ్చేశా...!

చందమామ వచ్చా జాబిల్లి వచ్చా
కలల మెట్లన్నెక్కీ ఎంచక్కగొచ్చా ॥
ఒళ్ళంత మైమరచి ఏమిటా చూపూ
మీద నిలుచున్నానూ కళ్ళెత్తి చూడూ ॥
నినుచూచి నీతోనె ఆడేందుకొచ్చా
మామయ్య నీతోడె ఉండేందుకొచ్చా ॥
గోరుముద్దలు పెడ్తూ అమ్మ చూపే నిన్ను
అసలేంటొ నిజమేంటో చూసేందుకొచ్చా ॥
తాకేసి చుట్టేసి పాడేందుకొచ్చా
చప్పట్లు చరిచేస్తూ గెంతేందుకొచ్చా॥
అమ్మతో నీకబురు చెప్పేందుకొచ్చా
చల్లనీ నీ మనసూ తెలిపేందుకొచ్చా
తెల్లనీ గుండెల్లో వెతికేందుకొచ్చా
దారి తెలిసిందోచ్ ఇంక నే వస్తుంటా ॥

- ఏటుకూరి ప్రసాద్

చలించాను !

చీకటిని చూసి
చలించ లేదు...
ఆకలేస్తే
చింతించ లేదు...
కానీ
ఆకు రాలితే
చింతించాను...
పువ్వు పలకరిస్తే
చలించాను !!!

కేశవ్ గోపాల్

హకీంజాని, బెల్లంకొండకు
ఎ.పి.రచయితల సంఘం భాషా పురస్కారాలు

గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం తెలుగు భాషా వ్యాప్తికి విశేష కృషి చేసిన వ్యక్తులకు తెలుగు భాషా పురస్కారాలను ప్రకటించింది. వేలాది వ్యాసాల ద్వారా తెలుగు భాష, సంస్కృతిని పరివ్యాప్తం చేసిన తెనాలికి చెందిన షేక్ అబ్దుల్ హకీంజానీకి, బాలల్లో ఆసక్తికరంగా ఆలోచనల్ని రేకెత్తించే విధంగా బాలసాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న చెన్నైకి చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త బెల్లంకొండ నాగేశ్వరరావుకు ఈయేటి తెలుగుభాష పురస్కారాలకు రచయితల సంఘం కమిటీ ఎంపికచేసింది. ఈ నెల 29న గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య వేదికపై జరిగే ప్రత్యేక సభలో వీరిని నగదు, సన్మాన పత్రం, శాలువాతో సత్కరించనున్నారు. సోమేపల్లి వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగే ఈ సభలో కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ , భూసురపల్లి వెంకటేశ్వర్లు, చిటిపోతు మస్తానయ్య, డా. వి.నాగరాజ్యలక్ష్మి పాల్గొంటారు.

ప్రాపంచిక దృక్పథాన్ని తెలిపే కథలు

దొండపాటి కృష్ణ, 9052326864

మన పరిసర ప్రాంతాలలోని స్థితిగతులు తెలిస్తే ప్రపంచం మొత్తం తెలిసినట్లు కాదు. సోషల్ మీడియాల్లోని వార్తలు చూస్తే అవగతమైనట్లు కాదు. ప్రపంచ యవనికపై కనిపించే పాత్రల సారం ఒడిసి పట్టుకోవడంజటిలమే! మన నేటివిటి ఉన్న కథలు చదివితే ప్రపంచం గురించి తెలియదు. బావిని దాటి వెలుపలి ప్రపంచాన్ని చూడాలి. ఆ వైపుగా ప్రయత్నం చేయాలి. సృష్టిలో ఉన్న ప్రతి దాని నుంచీ మనం ఎంతోకొంత నేర్చుకోవచ్చు. దానికి మన మెదడులో రోజుకు ఉత్పత్తయ్యే సరాసరి ఇరవై ఐదువేల నిర్ణయాలను అదుపులో పెట్టుకునే సామర్థ్యం ఉండాలి. మంచీ, చెడూ విచక్షణా జ్ఞానం ఉండాలి. 'అన్నం ఉడికిందో లేదో తెలియాలంటే ఒక మెతుకు పట్టుకోవాలి' అంటారు. అలా ఒక పుస్తకం మంచి నేస్తం కాగలదో లేదో ఒక పేజీ చదివితేనే అవగతమవుతుంది. 'అంటరాని దైవం' పుస్తకం అటువంటిదే! విమర్శకుడిని ఓడించి పాఠకుడు గెలవడం అనేది అరుదుగా జరుగుతుంటుంది. పుస్తక పఠనం ఉన్నవారు పాఠకుడిగా సంతృప్తిపడటం కన్నా వారిలో ఉన్న విమర్శకుడే గెలుస్తూ ఉంటాడు. కాని, ఈ పుస్తకం చదవడం ప్రారంభిస్తే మనలోని పాఠకుడు పూర్తిగా సంతృప్తి చెందుతాడు. విమర్శకుడు ఓడిపోతాడు. మనలోనిపాఠకుడిని సంతృప్తి పరిచింది మాత్రం డా.పార్థసారధి చిరువోలు కలం. నోబుల్ బహుమతి గ్రహీత హెమింగ్వే చెప్పినట్టు 'ప్రతిరోజూ కనీసం ఒక్క మంచివాక్యం రాయాలన్న తపన' నిరంతరం అతని ఆలోచనల తేనెతుట్టెను కదుపుతూంటుంది. దాదాపు ముప్పయేళ్ళ జర్నలిజం వ్యవసాయంలో ఎన్నో 'గట్టి గింజల్ని' ప్రోవు చేసుకున్నారు. ఇప్పటికీ ఆ క్షేత్రాన్ని వదిలిపోలేదు. ప్రముఖ దినపత్రికల్లో వందకుపైగా సమీక్షలు, నూటపాతిక పైగా కథలు రాశారు. ఇతర భాషల్లోని మంచి కథలు తటస్థ పడినప్పుడల్లా అనువాదాలు చేస్తుంటారు. అలా చేసిన కథల్లోని కొన్ని ఆణిముత్యాల సమాహారమే ఈ 'అంటరాని దైవం' కథాసంకలనం.

ఇందులో మొత్తం ఇరవై ఏడు కథలున్నాయి. అన్ని కథలూ ప్రచురితం అయినవే! విపుల మాసపత్రిక మూతపడిన తర్వాత అనువాద సాహిత్యం కొద్దిగా వెనకడుగు వేసిందన్నది జగమెరిగిన సత్యం. ఆ లోటును పూడుస్తూ మన మనసులను కదిలించే కథల్ని ఒక చోటుకు చేర్చారు రచయిత. ఆంగ్లం నుంచి అనువాదం చేసిన సంకలనమే అయినా ఇతర దేశాల కథలతోపాటుగా భారతీయ భాషకథలూ ఇందులోచోటు దక్కించుకున్నాయి. తమిళం, మలయాళం, కన్నడం, గుజరాతీ, ఒరియా, బెంగాలీ కథలు ఆంగ్లంతో పోల్చుకుంటే తమస్థాయి తక్కువేమీ కాదని నిరూపిస్తాయి. ఈ పుస్తకం వర్ధమాన రచయితలకు ఒక దిక్సూచి అయితే, పాఠకులకు పంచభక్ష్య పరమన్నం లాంటిదని చెప్పొచ్చు. ఇందులోఒక కథ ఎక్కువా, ఇంకో కథ తక్కువా కాదు. అన్ని కథలూ మనల్ని ఉర్రూతలూగిస్తాయి.

'దేవుడు ఎవరికి చెందినవాడు?' అనే ప్రశ్నను మన ముందుంచుతుంది 'అంటరాని దైవం' కథ. దేవుడు కోరకపోయినా చాలామంది బంగారం, డబ్బు, చీరలులాంటివి మొక్కుబడిగా సమర్పిస్తారు. వీరిలో 'ఎంతమంది ఒక పిచ్చివాడికో, బిచ్చగాడికో అడక్కుండా పెడతారు? పిచ్చివాళ్ళుగా పరిగణింపబడేవాళ్ళు ఆలయ ప్రాంగణంలో మృతదేహాలుగా పడి ఉంటే ఆ ప్రాంగణం అపవిత్రమైపోతుందా?' అనే ప్రశ్నలు మనల్ని నిలబెట్టి కడిగినట్లుంటుంది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ప్రతిభారాయ్ రచించిన ఈ ఆంగ్ల కథను చదవాల్సిందే!

ప్రాణం ఉన్నంతవరకూ, పైచేయి మనదే అనిపించినంతవరకూ మనం ఎవర్నీ పట్టించుకోము. అదే ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే పరిస్థితి తలెత్తినప్పుడు మాత్రంరోడ్డున పోయే దానయ్యచెప్పే మాటలుకూడా వేదాంతంలా తోస్తాయి. ఒకవేళ మన ప్రాణం నిలబడితే, మనం మరలా పుంజుకుంటే ఈసారిరోడ్డున పోయే ఆ దానయ్య ఓఅనామకుడిగా కనిపిస్తాడు. పట్టించుకోము. అచ్చంగా అలాగే సాగుతుంది జుయోజాస్ బల్సాసిస్ రచించిన రష్యన్ కథ 'సంతోషానికి చిరునామా'.

బతుకుతానన్న నమ్మకం లేక, ఇక చివరి ప్రయత్నం అన్నట్లుగా అడ్వాన్స్డ్ అంజినో పెక్టోరిస్‌తో బాధపడుతున్న ఒకతను రిటైరయ్యి పెన్షన్ తీసుకుంటున్న ఒక డాక్టర్‌ని



అంటరాని దైవం (కథాసంకలనం)
అనువాదం: డా. పార్థసారథి చిరువోలు
పేజీలు : 232, వెల: రూ. 160/- లు
ప్రతులకు: ఆన్లైన్ లోగిలి
మరియు అన్ని బుక్ హౌస్ లలో లభ్యం

కలిశాడు. సాయం చేయమని వేడుకున్నాడు. మొదట కాదని చెప్పింది ఆమె. తర్వాత వైద్యం చేస్తానంది. దానికి ఎందుకు. ఏమిటి, ఎలా, ఎప్పుడు లాంటి ప్రశ్నలు వేయకుండా తాను చెప్పినట్లు చేస్తేనే వైద్యం చేస్తానని అంటుంది. మరో ఆప్షన్ లేని అతను అందుకు సరేనన్నాడు. కొద్దిరోజులకు అతని ఆరోగ్యంలో మెరుగు కనిపించింది. బతుకుతాననే, బతకాలనే నమ్మకం కుదిరింది. తర్వాత ఆమె చెప్పినట్లే నడుచుకున్నాడా? ఆమెను పట్టించుకున్నాడా? అతను పూర్తిగా కోలుకున్నాడా? బతికే అవకాశం ఏమాత్రంలేని ఆ రోగానికి ఆమె ఎలా ట్రీట్మెంట్ఇచ్చింది? అన్నది తెలియా లంటే కథ చదవాల్సిందే! మనల్ని వెంటాడే కథ ఇది.

'పుట్టుకతో వచ్చింది పిడకలతోగానీ పోదు' అంటారు. కానీ, ఒకహిజ్రాగా మారిన వారి జీవితాల్లో ఏర్పడ్డ 'పుట్టుమచ్చ' ఎప్పుడు పోతుంది? కాలంచేసినా చెరగని ఆ పుట్టుమచ్చ ఎలా ఏర్పడుతుందో తెలియాలంటే కమలాదాస్ రచించిన భారతీయ ఆంగ్లకథ 'పుట్టుమచ్చ' చదవాల్సిందే! హిజ్రాలపై మనకున్న దృక్కోణం మారుతుంది. 'దండం దశగుణం భవేత్' అనే సూక్తిని అన్యాపదేశం చేస్తూ ప్రతీకాత్మకంగా సాగిన చినుమోడి రచించిన గుజరాతీ కథ 'ఏడో గుర్రం' ఆలోచింపజేస్తుంది. ఈ కథను మన నిజ జీవితానికి అప్లై చేసుకుని చూడాలి. మనలో చాలామంది అప్పటివరకు సాఫీగా సాగిపోతున్న జీవితంలోవిసుగెత్తి ఏదోసాధిద్దాం అనుకుంటారు. ప్రవేశం లేని ప్రదేశంలోకి వెళ్లొద్దని, చేతకానిదిచేయొద్దని కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు ఎన్నోరకాలుగా చెప్పి చూస్తారు. కానీ వాళ్ళువినరు. తీరా అందులోకి ప్రవేశించాక, సత్యం బోధపడ్డాక రెంటికి చెడ్డరేవడిలా అయిపోతుంది పరిస్థితి. 'ఏడోగుర్రం' కథ ఇతివృత్తం అదే!

కుష్వంత్ సింగ్ రచించిన భారతీయ ఆంగ్ల కథ 'జఘన ప్రియుడు' వారెవ్వా అనిపించే ఉన్న కథ. ఎంతో మర్యాదస్తుడైన ఇందులోని కథానాయకుడికి ఒక విచిత్రమైన కోరిక ఉంటుంది. దానివల్ల అతడు ఎటువంటి పరిస్థితుల్లోకి వెళ్లాడో చదివి నవ్వుకోండి. గిలిగింతలు పెట్టే కథ ఇది. అదే విధంగా శాంతాబాయి రచించిన కొంకణి కథ 'అతిథి మర్యాద' కూడా నవ్వులు పూయిస్తుంది. చాలామంది ఇళ్ళల్లో జరిగే అటువంటి సంఘటనల్ని తలుచుకుని పడీ పడీ నవ్వుకుంటారు. మాలతీ జోషి రచించిన రాజస్థానీ కథ 'బంధం' అనుబంధాల విలువల్ని తెలియజేస్తుంది. మానసిదాస్ రచించిన ఒరియా కథ 'పనికిమాలినవాడు' మనలోఉత్తేజాన్ని నింపుతుంది. ఎదుటి వ్యక్తిని ఎప్పుడూ తక్కువ అంచనా వేయొద్దని హెచ్చరిస్తుంది. అతులానంద గోస్వామి రచించిన అస్సామీ కథ 'ఆ ఉదయం...' ను చదివాక నటులు శ్రీ ఉత్తేజ్ ఆ కథపై కథకన్నా ఎక్కువ సమీక్ష విపుల పత్రికకు రాశారంటే ఈ సంకలనంలో ఎటువంటి కథలు చోటు చేసుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. సచ్చిదానంద రౌత్-రాయ్ రచించిన ఒరియా కథ 'రాతి మనిషి' మనలో కలవరం కల్గిస్తుంది. శవదహనం చేయడంలో అతనిది ప్రత్యేకమైన పద్ధతి. గంజాయి బిగించి, మృదంగం వాయిస్తూ, కీర్తనలు పాడుతూ దహన సంస్కారం పూర్తి చేస్తాడు. తల పగిలి మెదడు చిట్లటం నుంచి, మోకాలి చిప్ప నుంచి కాలు విడిపోవడం వరకు అన్నీ దగ్గరుండి గమనించి శవం పూర్తిగా కాలేలా చూస్తాడు. తల వెంట్రుకలు, చేతులు, కాళ్ళ గోళ్ళు లాంటి ఆనవాళ్ళు శ్మశానంలో మిగిలితే వాటిని మృతుని బంధువులకు అప్పగించి ఇంటికొస్తాడు. ఒంటినిండా నూనె పట్టించుకుని మసాజ్ చేసుకుంటాడు. అలాంటి మనిషిలో మానవత్వం ఉందని ఊహించగలమా? బాధ అంటే ఏమిటో అతనికి తెలుసనీ అనుకోగలమా? మృతుని గురించి ఓసారి ఆలోచించే హృదయం అతనికుందని భావించగలమా? ఈ కథ చదవండి. ఇటువంటి అనుమానాలన్నీ పటాపంచలు అయిపోతాయి.

మనలో ఇంతటి భావావేశం రగులుకోవడానికి డా. పార్థసారధి చిరువోలు అనువాద నైపుణ్యం ముఖ్య కారణం. ఆయన మూల కథల్లోని ఆత్మని అద్భుతంగా నిలబెట్టుకోవటమేకాక, చాలాచోట్ల ఆ విశిష్టతల్ని ఇంకా ఇనుమడింపజేశారు. ఇది 'అనువాద కథాసంకలనం' అని ఆయన ప్రకటించి ఉండకపోతే మనకు తెలిసేది కాదేమో. ఆ అనుమానం పాఠకుడికి కలగకూడదు అనుకున్నారేమో మూల కథల్లోని ఆయా ప్రాంతాలను ప్రస్తావించారు. ఆకట్టుకునే తెలుగు శీర్షికలు పెట్టి ఆకర్షించారు. తన శైలిలోని సరళత్వాన్ని మనకు అందించారు.

'ప్రపంచ సాహిత్య విస్తృతికి వివిధదేశ భాషా రచయితలు అనువాదాల ద్వారా తమ జ్ఞానసంపదను ఇచ్చి పుచ్చుకునే విధానం ఒక సామాజిక, సాంస్కృతిక, సాహిత్య అవసరం. అనువాద ప్రక్రియ ప్రాధాన్యతకు ఇదే కారణం అని, 'ఇది బంగారానికి అబ్బిన తావి!' అని పుస్తకం ముందుమాటలో కథాశిల్పి, సాహితీ విమర్శకులు శ్రీ విహారి వ్యాఖ్యానించారు. ఇది ముమ్మాటికీ నిజం.

ఇరుకు శిబిరాల్లో ఎంతకాలం?

- సమస్యను పరిష్కరించి ఇళ్లకు పంపండి
- 'మణిపూర్' బాధితుల డిమాండ్
- బీజేపీ ప్రభుత్వంపై నమ్మకం లేదని వెల్లడి

ఇంఫాల్: మణిపూర్‌లో మూడునెలలపాటు జరిగిన జాతుల ఘర్షణ కారణంగా ఎంతోమంది తమ ప్రాంతాలు, ఇళ్లను వదిలేసి కట్టుబట్టలతో అరకొర సౌకర్యాలతో ఇరుకైన సహాయ శిబిరాల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిన సంగతి తెలిసిందే. అయితే తమ ఊళ్లకు, ఇళ్లకు వెళ్లేలా సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వారంతా డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది బాధితులైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరాలకు వెళ్లడానికి ఇష్టపడటంలేదు. ఎందుకంటే తాము ఎప్పటికీ సొంత ఇళ్లకు తిరిగి రాలేమని భయపడుతున్నారు. ఇంఫాల్ తూర్పు జిల్లా అకంపట్‌లోని ఆదర్శ బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన తొంగ్జు కేంద్ర సహాయ శిబిరంలో తెంగ్నౌపాల్, చురచంద్‌పూర్ జిల్లాలకు చెందిన కొంతమంది బాధితులు తల దాచుకుంటున్నారు. 'తమ ఇళ్లను పునర్నిర్మిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీపై తమకు నమ్మకం లేదు' అని వారు పీటీఐ ప్రతినిధికి చెప్పారు. 'మూడు నెలలకు పైగా మేము సహాయ శిబిరాల్లో నివసిస్తున్నాం. మేం ఎంతకాలం ఇక్కడ ఉండాలి? మా ఇల్లు తిరిగి కావాలి. మా వాళ్లను హత్య చేశారు. ఇప్పుడు మాకు న్యాయం కావాలి' అని భారతదేశం-మయన్మార్ సరిహద్దు పట్టణం మోరేకు చెందిన సనాతంబి పేర్కొన్నారు. హింసలో సర్వం కోల్పోయిన చురచంద్‌పూర్‌కు చెందిన గంథోయిబీ (24), ఆమె కుటుంబం కూడా సహాయ శిబిరంలో ఉండటానికి ఇష్టపడటంలేదు. వారు ఇంటికి తిరిగి వెళ్లాలనుకుంటున్నారు. 'నాకు ఆరుగురు సభ్యుల కుటుంబం ఉంది - భర్త, 7 నెలల పాప, అత్త మామలు, కోడలు, మరదలు - అందరం ఇక్కడ సహాయ శిబిరంలో ఉన్నాం. మే 3న మా ఇల్లు కాలిపోయింది. మేం అక్కడి నుంచి పారిపోతున్నప్పుడు ఏమీ తెచ్చుకోలేకపోయాం. ఈ ఘర్షణలో మేం సర్వం కోల్పోయాం' అని ఆమె ఫోన్‌లో పీటీఐకి తెలిపారు. భవిష్యత్తులో సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత తమ ఇళ్లకు పంపుతామని అధికారులు హామీ ఇస్తున్నప్పటికీ సహాయ శిబిరంలో ఉన్న చాలా మంది ప్రభుత్వం వేర్వేరు ప్రదేశాలలో నిర్మించిన తాత్కాలిక ఇళ్లకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. అయితే తాము ప్రభుత్వ మాటలు విశ్వసించడంలేదని, ఆ తాత్కాలిక ప్రదేశాలలో అది ఎంతకాలం ఉంటుందో తెలియదని వాపోయారు. ' మేమంతా ప్రభుత్వ హామీలతో విసిగిపోయాం...వారి నుంచి సాయం అందుతుందన్న నమ్మకంలేదు... మా సొంత ఇళ్లకు తిరిగి వెళ్లాలనుకుంటున్నాం' అని గంథోయిబీ స్పష్టం చేశారు. 'మేము మోరే పట్టణంలోని మా ఇళ్లకు తిరిగి వెళ్లాలనుకుంటున్నాము. ఈ పట్టణం ఇంఫాల్ తర్వాత మణిపూర్‌కు ఆదాయ సేకరణలో 2వ స్థానంలో ఉంది. ఈ హింస ఇలాగే కొనసాగితే భారతదేశం తీవ్రంగా నష్టపోతుంది. నేడు మణిపూర్‌లో ఉన్న పరిస్థితికి బీజేపీయే కారణం' అని ఆమె పేర్కొన్నారు. 'మోరే విషయానికొస్తే, గత 10 సంవత్సరాలుగా టౌన్ కమిటీ ఎన్నికలు లేవు. మార్వాడీలు, పంజాబీలు అందరూ పట్టణం నుండి పారిపోయారు . ఈ హింస ప్రారంభమైన తర్వాత తమిళ ప్రజలు వెళ్లిపోయారు' అని మోరేకు చెందిన ఇంగోబి సింగ్ (75) చెప్పారు. మోరే, మణిపూర్‌లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాలలో ఒకటి. తెంగ్నౌపాల్ జిల్లాలో కుకీల ఆధిపత్యం గల పట్టణం. గణనీయ సంఖ్యలో తమిళులు, పంజాబీలు కూడా ఉన్నారు. అలాగే క్రైస్తవులు మెజారిటీగా ఉన్న బహుళ-మత పట్టణం కూడా. హిందువులు, ముస్లింలు, బౌద్ధులు, సిక్కులు, జైనులు ఉన్నారు. 'ఇలా ఎంతకాలం బాధపడతాం? వీలైనంత త్వరగా శాంతిని నెలకొల్పాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. మేము చురచంద్‌పూర్‌లోని మా ఇళ్లకు తిరిగి వెళ్లాలనుకుంటున్నాము' అని రాజేన్ హుయిరామ్ (37) అన్నారు. ఆగస్టు 23న, మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ మాట్లాడుతూ... హింసాకాండ బాధితులకు ముందస్తుగా నిర్మించిన గృహాలు శాశ్వత ఏర్పాటు కాదని, సహాయక శిబిరాల్లో నివసించే వారి కష్టాలను తగ్గించడానికేనని వెల్లడించారు.

ఇంఫాల్ తూర్పు జిల్లాలోని సజివా జైలు కాంప్లెక్స్‌లో 300 కుటుంబాలకు తాత్కాలికంగా నిర్మించిన నివాసాలను అప్పగించారు. ఎనిమిది సైట్లలో ముందుగా సిద్ధం చేసిన నిర్మాణాలను తీసుకొచ్చి ఆయా స్థలాల్లో నివాసాలను ఏర్పాటు చేశారు. బిష్ణుపూర్ జిల్లాలోని క్వాక్తాలో 320, సాజివాలో 400 , ఇంఫాల్ తూర్పులోని సావోంబంగ్‌లో 200 ఇళ్లు నిర్మించామని, తౌబల్ జిల్లాలోని యైతిబీ లౌకోల్‌లో 400 ఇళ్లను నిర్మించామని సింగ్ చెప్పారు. కాంగ్‌పోక్పి, చురచంద్‌పూర్ జిల్లాల్లో కొంత జాప్యం జరుగుతోందని ముఖ్యమంత్రి చెప్పారు. కాంగ్‌పోక్పి జిల్లాలో 700 కుటుంబాలకు రెండు స్థలాలను పరిశీలించారు. చురచంద్‌పూర్‌లో కూడా నిర్మాణం కోసం స్థలాన్ని గుర్తించామని ఆయన తెలిపారు. మే 3న మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలు రేగడంతో 160 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక వందల మంది గాయపడిన సంగతి విదితమే.

బాణసంచా ఫ్యాక్టరీలో ప్రమాదం

ఆరుగురి మృతి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో బాణసంచా ఫ్యాక్టరీలో ఘోర ప్రమాదం చోటుచేసుకుని ఆరుగురు దుర్మరణం చెందారు. ఉత్తర 24 పరగణా జిల్లాలోని ఒక బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు సంభవించింది. దీంతో అందులో పనిచేస్తున్న ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పేలుడు ధాటికి భవనం పైకప్పు కూలింది. ఘటనాస్థలంలో మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇళ్ల మధ్యలో ఈ ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నారని సమాచారం. పశ్చిమబెంగాల్ స్టేట్ యూనివర్సిటీకి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ ఫ్యాక్టరీ ఉంది. ఈ ఘటన నేపథ్యంలో పక్కనే ఇళ్లలో నివసిస్తున్న వారిని అధికారులు అప్రమత్తం చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు.

ఏప్రిల్-జూన్‌లో తగ్గిన ఎఫ్‌డీఐ ఈక్విటీ ఇన్‌ఫ్లో

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-జూన్ కాలంలో భారతదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 34 శాతం తగ్గి 10.94 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) తెలిపింది. 2022-23 ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో ఎఫ్‌డీఐ ఇన్‌ఫ్లో 16.59 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని డీపీఐఐటీ డేటా వెల్లడించింది. డేటా ప్రకారం ఏప్రిల్-జూన్ 2023-24 మధ్య కాలంలో మారిషస్, సింగపూర్, యూఎస్, యూఏఈ సహా పలు దేశాల నుంచి ఎఫ్‌డీఐ తగ్గింది. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ట్రేడింగ్, ఆటోమొబైల్, ఫార్మాతో సహా విభాగాల్లో ఇన్‌ఫ్లో తగ్గాయని డేటా పేర్కొంది.

ఢిల్లీ మెట్రో స్టేషన్ల గోడలపై ఖలిస్థానీ రాతలు

కేసు నమోదు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఆదివారం ఉదయం మెట్రో స్టేషన్లలో ఖలిస్థానీ మద్దతుదారులు రంగులస్ప్రేతో రాసిన రాతలు రాయడంతో కలకలం రేగింది. దీనిపై స్పందించిన పోలీసులు కేసు నమోదు చేశారు. దేశ రాజధానిలోని ఐదు మెట్రో స్టేషన్ల గోడలపై ఖలిస్థాన్ మద్దతుగా రాసిన రాతలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీస్ కమిషనర్ తెలిపారు. సిఖ్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) పేరుతో ఖలిస్థాన్ మద్దతుగా ఢిల్లీలోని శివాజీ పార్క్ మెట్రో స్టేషన్ నుంచి పంజాబ్ బాగ్ వరకు ఉన్న దాదాపు ఐదు స్టేషన్లలో ఖలిస్థాన్‌కు మద్దతుగా రాతలు రాశారు. నలుపు రంగుతో ఢిల్లీ బనేగా ఖలిస్థాన్, ఖలిస్థాన్ రిఫరెండం జిందాబాద్ అనే రాతలు దర్శనమిచ్చాయి. వచ్చే నెల 9,10 తేదీల్లో నగరంలో జీ20 సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఖలిస్థాన్ మద్దతుదారులు రాసిన రాతలతో భద్రతా సిబ్బంది అలెర్ట్ అయ్యారు. గతంలో అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడాలో నివసిస్తున్న ఖలిస్థానీ మద్దతుదారులు ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, హిందూ దేవాలయాలపై దాడులకు పాల్పడ్డారు.

బాస్మతి బియ్యం ఎగుమతులపై ఆంక్షలు

న్యూఢిల్లీ: బాస్మతి బియ్యం ఎగుమతులపై కేంద్రం ఆంక్షలు విధించింది. టన్ను 1200 డాలర్ల కంటే తక్కువ విలువ కలిగిన ఒప్పందాలు తాత్కాలికంగా నిలిపివేస్తు వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉప్పుడు బియ్యంపై 20 శాతం సుంకం విధించిన ఒక రోజు తర్వాత భారతదేశం బాస్మతి బియ్యం ఎగుమతిపై ఆంక్షలు విధించింది. బాస్మతి బియ్యం పేర ఎగుమతి అవుతున్న బాస్మతీయేతర ఎగుమతులను తనిఖీ చేయడానికి ఈ చర్య తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉత్తర్వులను అనుసరించి టన్నుకు 1,200 డాలర్ల కంటే తక్కువ ఉన్న బాస్మతి బియ్యం ఒప్పందాలు నిలిపివేసి, ఏపీఈడీఏ చైర్మన్ ఏర్పాటు చేసే కమిటీ ద్వారా మూల్యాంకనం జరగనున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వు పేర్కొంది. బాస్మతి బియ్యం ఎగుమతుల నియంత్రణపై వ్యవసాయం, ప్రాసెస్డ్ ప్రొడక్ట్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట& అథారిటీ(ఏపీఈడీఏ) బాధ్యత వహిస్తుంది. బాస్మతీయేతర బియ్యంను బాస్మతి బియ్యంగా ఎగుమతి చేయకుండా అధికారులకు ఎంఈపీ సహాయం చేస్తుంది. ఇరాన్, ఇరాక్, యెమెన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అమెరికా వంటి దేశాలకు భారతదేశం దాదాపు 4 మిలియన్ మెట్రిక్ టన్నుట బాస్మతి బియ్యంను ఎగుమతి చేస్తుంది. దేశీయ సరఫరాను పెంచడానికి, రాబోయే పండుగ సీజన్‌లో రిటైల్ ధరలను అదుపులో ఉంచడానికి గత నెలలో ప్రభుత్వం బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులను నిషేధించింది. గతేడాది సెప్టెంబరులో విరిగిన బియ్యం(నూకలు) ఎగుమతులను కూడా భారత్ నిషేధించింది.

పారిశ్రామిక హబ్బులు, ఒకటే జీఎస్టీ అవశ్యం

ఎంఎస్ఎంఈలకు రక్షణపై రాహుల్



న్యూఢిల్లీ: దేశపురోగతికి ఎంతగానో దోహదపడే చిన్న వ్యాపారాలకు, ముఖ్యంగా మహిళా ఎంట్రప్రెన్యూర్‌లకు తోడ్పాటు కల్పించడం ఎంతో అవసరమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆర్థిక వృద్ధికి చోదకశక్తిని ఎంఎస్ఎంఈలు అందిస్తాయని, వీటికి రక్షణ ఉండాలంటే పారిశ్రామిక హబ్బులను ఏర్పాటు చేయడం, ఒకటే జీఎస్టీ రేటును అమలు చేయడం వంటి చర్యలు అత్యవసరమని సూచించారు. ఇటీవల ఊటీలోని చాక్లెట్ ఫ్యాక్టరీని సందర్శించి, అక్కడి మహిళా కార్మికులతో ముచ్చటించిన వీడియోను రాహుల్ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. మహిళా కార్మికుల కష్టాన్ని శ్లాఘించారు. బడా కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ, ఇటువంటి చిన్న పరిశ్రమలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం కార్మికులు, ముఖ్యంగా మహిళల కష్టానికి, దృఢ నిశ్చయానికి అవమానమని రాహుల్ అన్నారు. నీల్‌గిరిల నడుమ మహిళలు నడిపించే 'మూడీస్ చాక్లెట్స్' ఫ్యాక్టరీని ఆయన సందర్శించారు. చిన్న వ్యాపారం వెనుక దంపతులు మురళీధర్ రావు, స్వాతి కృషి అభినందనీయమని ఓ ప్రకటనలో కొనియాడారు. మొత్తం మహిళలతో కూడిన 70 బృందాలు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి చాక్లెట్లు ఎప్పుడు తినలేదని రాహుల్ ప్రశంసించారు. దేశంలోని ఇతర చిన్న,మధ్య వ్యాపారాల తరహాలో మూడీస్ కూడా గబ్బర్ సింగ్ ట్యాక్స్ బాధిత సంస్థేనని వెల్లడించారు. భారతీయ ఆర్థిక వృద్ధికి ఎంతగానో తోడ్పడే కార్మికుల ధృతనిశ్చయాన్ని అవమానించేలా పాలకుల తీరు ఉందని వ్యాఖ్యానించారు. ఎంఎస్ఎంఈలకు రక్షణ కల్పించేందుకు పారిశ్రామిక హబ్‌ల సృష్టి, ఒకటే జీఎస్టీ రేటు అమలు ఎంతో అవసరమని రాహుల్ గాంధీ నొక్కిచెప్పారు. రాహుల్ పర్యటనకు సంబంధించిన వీడియోను ఎక్స్ మాధ్యమంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పంచుకున్నారు. 'భారత్ జోడో యాత్రను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాహుల్ ఊటీలోని చాక్లెట్ ఫ్యాక్టరీకి వెళ్లారు. ఆ ఫ్యాక్టరీని మహిళలు నడుపుతున్నారు. వారందరితో ఆయన మాట్లాడారు. వారి అనుభవాలను తెలుసుకున్నారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు' అని జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. ఇదేవిధంగా లఘు, చిన్న, మధ్యస్థాయి పరిశ్రమల వారందరి సమస్యలను తెలుసుకొని, మద్దతివ్వడం అవసరమని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకుల చైర్మన్ల పదవీ కాలం పెంపు?

న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)ల చైర్మన్ పదవీకాలాన్ని పొడిగించాలని కేంద్రం యోచిస్తున్న సమాచారం. ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ)ల అధిపతుల పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచాలని నిర్ణయించినట్లు ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. దీంతో పాటు పీఎస్‌బీల్లో పని చేస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ల (ఎండీ)ల పదవీ విరమణ వయసును కూడా ప్రస్తుతమున్న 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని ప్రతిపాదనలున్నాయి. ఎస్‌బీఐ చైర్మన్‌గా ఉన్న దినేశ్ ఖరా 2020 అక్టోబరులో మూడేళ్ల కాలానికి చైర్మన్‌గా ఎంపికైయారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఆ పదవిలో ఆయన 63 ఏళ్లు నిండే వరకు కొనసాగే అవకాశం ఉంది. వచ్చే ఏడాది ఆగష్టులో ఆయనకు 63 ఏళ్లు నిండుతాయి. దీంతో ఆయనను మరో ఏడాది కొనసాగించే అవకాశం ఉండగా, పదవీ విరమణ వయసు 65 ఏళ్లకు పెంచితే, ఆ తర్వాత కూడా మరో రెండేళ్లు ఆయన పదవిలో కొనసాగే అవకాశం ఉంది.

ఆ చిన్నారి ముందు శిఖరమైనా చిన్నబోవాల్సిందే!

- పర్వతారోహణలో దూసుకుపోతున్న సాన్వీసూద్
- అరుదైన ఘనతలతో అత్యున్నత శిఖరాలకు

చండీగఢ్: అత్యంత పిన్న వయసులోనే పంజాబ్‌కుచెందిన చిన్నారి సాన్వీసూద్...పర్వాతారోహణలో చరిత్ర సృష్టిస్తోంది. ఏటికేడు ఆమె అరుదైన ఘనతలను సొంతం చేసుకుంటోంది. అత్యంత ఎత్తయిన శిఖరాలు, పర్వతాలు ఎక్కడమంటే ఆమెకు ఎంతో ఇష్టం. బాలికలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆ చిన్నారి చెబుతోంది. పంజాబ్‌లోని రూప్‌నగర్ జిల్లాకు చెందిన సాన్వీ... ఇప్పటికే ఎవరెస్ట్ శిఖరంపై భారత జెండాను రెపరెపలాడించింది. గతేడాది ఏడేళ్ల వయసులో ఆమె ఈ ఘనత సాధించి దేశంలోనే అతి పిన్న వయస్కురాలిగా నిలిచిందని ఆమె తండ్రి దీపక్ సూద్ గర్వంగా చెప్పారు. ఇక గత ఏడాది జులైలో 5,895 మీటర్ల ఎత్తులో ఉన్న ఆఫ్రికా ఖండంలోని అత్యంత ఎత్తయిన పర్వత శిఖరం కిలిమంజారోను సాన్వి విజయవంతంగా అధిరోహించింది. ఆసియాలో అత్యంత పిన్న వయసులో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించింది సాన్వీనేయని సూద్ చెప్పారు. కాగా పర్వతాలు ఎక్కాలన్న ఆమె తపన ఈ ఏడాది కూడా కొనసాగింది. సాన్వీ ఈ ఏడాది మేలో ఆస్ట్రేలియాలో కెల్లా ఎత్తయిన శిఖరం మౌంట్ కోస్కియుస్కో (2,228 మీటర్లు)ని, జులైలో రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని (5,642 మీటర్లు) అధిరోహించి, ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కురాలిగా నిలవడం విశేషం. ఈ రంగంలో ఆమె చేసిన విశేష కృషికి గాను పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్... స్వాతంత్ర్య దినోత్సవం రోజున సాన్వీని రాష్ట్ర అవార్డుతో సత్కరించారు. అయితే తాను పర్వతారోహణ చేయడానికి తండ్రి ప్రోత్సాహం ఎంతో ప్రోత్సహించారని ఈ సందర్భంగా సాన్వీ తెలిపింది. కొండ ప్రాంతాలలో తన తండ్రి పని చేసే ప్రదేశాలను సందర్శించిన తర్వాత ట్రెక్కింగ్ చేయడంలో నైపుణ్యం పెరిగిందని ఆమె గుర్తు చేసుకున్నారు. సాన్వీ తండ్రి సివిల్ కాంట్రాక్టర్. అతని పని ఎక్కువగా పర్వత ప్రాంతాల్లోని ప్రాజెక్టుల కోసం మట్టి పరీక్షకు సంబంధించినది. 'మేము ప్రతి సంవత్సరం కేదార్‌నాథ్, మాతా వైష్ణో దేవి ఆలయాన్ని సందర్శిస్తాం. అప్పుడే నా కూతురికి మంచి స్టామినా ఉందని తెలుసుకున్నాను' అని సాన్వీ తండ్రి దీపక్ సూద్ గుర్తు చేసుకున్నారు. 'నా పని చాలావరకు కొండ ప్రాంతాలలో ఉండటంతో, సాన్వీ నాతో పాటు పని ప్రదేశాలకు వచ్చేది. ఒకసారి ఆమె నాతో కలిసి రోహ్‌తంగ్‌లో 18 కిలోమీటర్ల ట్రెక్‌ను కవర్ చేసింది. ఆ తర్వాత ఆమె ఈ రంగంలో రాణించగలదని నేను భావించాను' అని దీపక్ తెలిపారు. భాగంగా సైక్లింగ్, యోగా వంటి ఇతర కార్యకలాపాలను ప్రాక్టీస్ చేస్తుందని ఆయన చెప్పారు. శరీర దారుఢ్యం కోసం కార్డియో, ఇతర వ్యాయామాలు కూడా చేస్తామని... తన కుమార్తె పర్వతం ఎక్కిన ప్రతిసారీ ఆమెతో పాటు ఉండే దీపక్ తెలిపారు. సాన్వీ... సవాళ్లతో కూడుకున్న పర్వతారోహణపై అంకితభావంతో ఉన్నప్పటికీ తన చదువుపై కూడా అంతే అంకితభావాన్ని ప్రదర్శించడం విశేషం. సాన్వీ తల్లి నోట్స్ తయారు చేస్తూ ఆమె చదువులో సహాయం చేస్తుంది. చదువులో బాగా రాణిస్తున్నందుకు సాన్వీని ఉపాధ్యాయులు కూడా ప్రశంసించారు. తన కుమార్తె సమయాన్ని సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రణాళికాబద్ధమైన దినచర్యను గురించి దీపక్ వివరించారు. 'జులైలో ఎల్బ్రస్ పర్వతాన్ని స్కేలింగ్ చేసిన తర్వాత, ఆమె తెల్లవారుజామున 3 గంటలకు ఇంటికి తిరిగి వచ్చింది. కానీ ఆమె ఉదయం 8 గంటలకు తన పాఠశాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉంది'అని ఆయన చెప్పారు. మొహాలీలోని ఒక పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న సాన్వీ... బాలికలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటే వారు కోరుకున్నది ఏదైనా చేయగలరని అందరికీ తెలియజేయాలనుకుంటున్నట్లు చెప్పింది.

అవినీతి అధికారులపై చర్యలేవీ?

వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో 500 అభ్యర్థనలు: కేంద్ర విజిలెన్స్ కమిషన్

న్యూఢిల్లీ: అవినీతిని అంతంచేస్తామనీ, ఏమాత్రం సహించబోమని ప్రకటనలుపై ప్రకటనలు గుప్పిస్తున్న కేంద్రంలోని కాషాయ పాలకులు ఆచరణలో ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. అవినీతి అధికారులపై చర్యల కోసం 500 అభ్యర్థనలు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్నాయంటే అధికారులలో అవినీతి నిర్మూలనకు సంబంధించి ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతోంది. అవినీతికి పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగులపై విచారణకు అనుమతి కోరుతూ సీబీఐ నుంచి వచ్చిన 500 కు పైగా అభ్యర్థనలు వివిధ ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్నాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) 2022 వార్షిక నివేదిక పేర్కొంది. అలాగే 272 అభ్యర్థనలు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది. అవినీతి అధికారిపై విచారణకు అనుమతి కోరుతూ వచ్చిన అభ్యర్థనలపై ప్రభుత్వ శాఖలు మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అటార్నీ జనరల్ లేదా ఆయన కార్యాలయంలోని ఏదైనా ఇతర న్యాయ అధికారితో సంప్రదింపులు అవసరమైన సందర్భాల్లో అదనంగా ఒక నెల సమయం మంజూరు చేస్తారు. పెండింగ్‌లో ఉన్న మొత్తం 525 అభ్యర్థనలలో అత్యధికంగా 167 ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక సేవల విభాగం వద్ద ఉన్నాయని నివేదిక పేర్కొంది. 41 మహారాష్ట్ర ప్రభుత్వం వద్ద, 31 ఆర్థిక మంత్రిత్వ శాఖ, బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ పరిధిలోని రెవెన్యూ శాఖ, ఇతరుల వద్ద ఉన్నాయని తెలిపింది. డిసెంబరు 31, 2022 నాటికి హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం వద్ద 25 అభ్యర్థనలు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాల వద్ద ఒక్కొక్కటి 23, రైల్వే మంత్రిత్వ శాఖ వద్ద 22 అభ్యర్థనలు విచారణ మంజూరు కోసం పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఇటువంటి మొత్తం 20 అభ్యర్థనలు కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ వద్ద, 16 రక్షణ మంత్రిత్వ శాఖ వద్ద, 12 సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ వద్ద, 11 హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ వద్ద, విద్యా మంత్రిత్వ శాఖ వద్ద 8 పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే, ఢిల్లీ ప్రభుత్వం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వద్ద ఒక్కొక్కటి ఆరు అభ్యర్థనలు పెండింగ్‌లో ఉన్నాయని, తమిళనాడు ప్రభుత్వం, లోక్‌సభలో ఐదేసి చొప్పున అభ్యర్థనలు పెండింగ్‌లో ఉన్నాయని నివేదిక పేర్కొంది. వివిధ సంస్థలతో విచారణ మంజూరు కోసం పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సీవీసీ సమీక్షిస్తుందని తెలిపింది. '2022 సంవత్సరం చివరినాటికి, పీసీ యాక్ట్-1988 ప్రకారం విచారణ కోసం అనుమతి మంజూరు కోసం వివిధ సంస్థలకు చెందిన మొత్తం 198 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నివేదించింది' అని నివేదిక ఇటీవల బహిరంగపరచింది. 'ఈ కేసుల్లో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం, ఇతర శాఖలు, అధికారుల వద్ద పెండింగ్‌లో ఉంది. 2022 లో విచారణ మంజూరు కోసం 525 వేర్వేరు అభ్యర్థనలు ఉన్నాయి. కొన్ని కేసుల్లో ఒకటి కంటే ఎక్కువ మంది నిందితులు ఉన్నారు' అని వెల్లడించింది. సెంట్రల్ విజిలెన్స్ (సీవీసీ) విచారణ అనుమతి కోసం పెండింగ్‌లో ఉన్న కేసులను కేంద్ర ప్రభుత్వ శాఖలు, దాని సంస్థలతో సమర్థవంతమైన అధికారం ముందస్తు నిర్ణయం కోసం క్రమం తప్పకుండా అనుసరిస్తుందని నివేదిక తెలిపింది. 'తగిన విధంగా మాట్లాడే ఉత్తర్వులను జారీ చేయడం ద్వారా ప్రాసిక్యూషన్ అనుమతి మంజూరు లేదా తిరస్కరణపై సమర్థ అధికారులు నిర్ణయించాల్సిన అవసరాన్ని కూడా కమిషన్ నొక్కి చెప్పింది' అని వివరించింది. మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు, సీబీఐ ఇతర దర్యాప్తు సంస్థలలోని సమర్థ అధికారుల మధ్య అభిప్రాయ భేదాలు ఏర్పడిన సందర్భాల్లో అందుబాటులో ఉన్న పత్రాలు, సమాచారం ఆధారంగా సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల సమర్థ అధికారుల తాత్కాలిక అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ప్రభుత్వ ఉద్యోగులపై విచారణకు అనుమతిని కోరిన తర్వాత కమిషన్ అటువంటి అభిప్రాయ భేదాలను పరిష్కరిస్తుంది. నివేదిక పేర్కొంది. డిసెంబరు 31, 2022 నాటికి, 224 మంది అధికారులతో సంబంధం ఉన్న 99 సూచనలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది.

ప్రధాని అభ్యర్థిగా రాహుల్

అశోక్ గెహ్లాత్

జైపూర్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇండియా కూటమి తరపున బరిలోకి దిగుతారని రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ స్పష్టం చేశారు. ఈ విషయంపై ఇండియా కూటమిలో చర్చించినట్లు ఆయన తెలిపారు. ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీ ఉండేందుకు అన్ని పార్టీలు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఏ ఎన్నికల్లోనైనా స్థానిక అంశాలు ఉంటాయని, అయితే ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లోని ప్రత్యేక పరిస్థితులు దేశంలోని అన్ని పార్టీలపై తీవ్ర ఒత్తిడి తెచ్చాయని గెహ్లాత్ అన్నారు. దీని ఫలితంగానే ఇండియా కూటమి ఉద్భవించిందన్నారు. 2014లో మోదీ ప్రధాని పదవి చేపట్టిన నాటి నుంచే అహంకారపూరిత వైఖరిని ప్రదర్శిస్తున్నారు. ఒక దేశ ప్రధాని అలా ఉండకూడదు. కేవలం 31 శాతం ఓట్లతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మిగిలిన 69 శాతం ఓటర్లు ఆయనకు వ్యతిరేకంగా ఉన్నారనే సంగతిని గమనించాలని గెహ్లాత్ వివరించారు. ఆయన 50 శాతం ఓట్లతో మళ్లీ గద్దెనెక్కుతానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ, అది అయ్యే పని కాదని తెలుసుకోవాలి అని ఆయన అన్నారు. అప్పుడు జనాదరణ ఉన్నప్పుడే 50 శాతం ఓట్లు పడలేదు... అది ఇప్పుడు ఎలా సాధ్యమవుతోందని భావిస్తున్నారని గెహ్లాత్ ప్రశ్నించారు. ఇప్పటి వరకు మోదీ ఎన్నో వాగ్దానాలు చేశారు... వాటిలో ఎంతవరకు అమలు చేశారో ప్రజలకు తెలుసు అని గెహ్లాత్ అన్నారు.

మోదీ, జగన్‌ను గద్దెదించాల్సిందే

వినుకొండ సభలో రామకృష్ణ

బస్సు యాత్ర నేటి షెడ్యూల్

అద్దంకిలో రోడ్‌షో

ఒంగోలులో రైతు సమస్యలపై రౌండ్‌టేబుల్

మార్కాపురంలో బహిరంగసభ

విశాలాంధ్ర - వినుకొండ: ఎన్డీయే పాలనలో దేశం తీవ్ర ప్రమాదంలో మునిగిపోయిందనీ, ప్రధాని నరేంద్రమోదీని గద్దె దించాల్సిన అవసరం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాష్ట్రాన్ని రక్షిద్దాం... దేశాన్ని కాపాడుదాం అనే నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సు జాత యాత్ర ఆదివారం సాయంత్రం వినుకొండ చేరుకుంది. స్థానిక సిపిఐ నేతలు పట్టణ శివారులో ఘన స్వాగతం పలికి శివయ్య స్థూపం సెంటర్ వరకు భారీ ర్యాలీనిర్వహించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నడుమ నాయకులు బహిరంగ సభవద్దకు చేరారు. అనంతరం శివయ్య స్థూపం వద్ద సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ, మోదీ గద్దె నెక్కిన నాటి నుంచి అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు బడా వ్యాపార వేత్తలకు అతి తక్కువ ధరలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ఘన చరిత్ర గల విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ఆలోచన దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి గద్దె దిగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించి ఇంత అప్పులపాలుచేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఉద్యోగులకు జీతాలు

చెల్లించేందుకు డబ్బులు లేవని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, ఉద్యోగాల భర్తీ లేదని, ప్రాజెక్టుల నిర్మాణాలు లేక నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. నేను పేదలవైపు ఉన్నాను, అందరూ పెత్తందార్లవైపు ఉన్నారు అంటున్న జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రాష్ట్రాల్లో ఎకరాలకు ఎకరాల్లో నివాసాలు ఎట్లా ఏర్పరచుకున్నారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని వినుకొండ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడుని నిలదీయాలన్నారు. ఎమ్మెల్యేలంతా రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా మారి జగనన్నకాలనీ పేరుతో ఒక్కొక్కరికీ ఒక సెంటు మాత్రమే ఇవ్వటం దారుణమన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికార అహంతో స్థానిక మసీదు మాన్యంలోని పేదలకు నీరు, విద్యుత్ కట్ చేయమని చెప్పటం దారుణమన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజననాటి నుంచి ప్రజాసమస్యలపై సీపీఐ అలుపెరగని పోరాటం చేస్తున్నదన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలుచేసిన జగన్‌మోహన్‌రెడ్డి మోదీకి గులాం చేస్తున్నారని రాష్ట్రంలో అడ్డగోలు పాలన చేస్తున్నప్పటికీ మోదీ నోరుమెదపటం లేదని, పేదల బ్రతుకులు బాగుపడాలంటే విద్యావంతులు ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రస్తుత పరిస్థితులలో రాజకీయ ప్రత్యామ్నాయం ఎంతైనా అవసరమని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వవ్యతిరేఖ విధానాలపై రాష్ట్ర ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు సభకుహాజరైనప్రజలను చైతన్యపరిచాయి. ఈ సందర్భంగా అనేక సంఘాల వారు తమ సమస్యలను రామకృష్ణ దృష్టికి వినతిపత్రాల రూపంలో తీసుకువచ్చారు. ఈ కార్యక్రమములో సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యు లు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జంగాల అజయ్ కుమార్, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివారెడ్డి, జాన్సన్ బాబు, వైఎఫ్ రాష్ట్ర నాయకులు మహంకాళి సుబ్బారావు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి విజయలక్ష్మి, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి. ఎ. మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, మాజీ వైస్ చైర్మన్ సంద్రపాటి సైదా , పఠాన్ లాల్ ఖాన్, వినుకొండ మండల కార్యదర్శి బూదాల సాగర్, తదితరులు ర్యాలీలోను, బహిరంగ సభలోను పాల్గొన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు బహిరంగ సభ వేదికపైకి వక్తలను ఆహ్వానించారు.

సెప్టెంబర్ 25, 26, 27 తేదీల్లో

వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలు ఆగస్టు నుంచి సెప్టెంబర్ 25, 26, 27 తేదీలకు మార్పు జరిగినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఈ మార్పును గమనించి రాష్ట్ర మహాసభలకు ప్రతినిధులను వారికి ఇచ్చిన కోటా ప్రకారం ఎన్నిక చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 25వ తేదీ మొదటి రోజు బాపట్ల లో 10 వేల మంది గ్రామీణ కష్టజీవులతో కూలి దండు మహాప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. 5 లక్షలు సంఘ సభ్యత్వానికి ప్రాతిథ్యం వహిస్తున్న 400 మంది రెండు రోజులు పాటు జరిగే ప్రతినిధుల సభకు హాజరవుతారని తెలిపారు. ఇప్పటినుండే అన్ని జిల్లాల నాయకత్వాలు కూలిదండు మహా ప్రదర్శనకు జన సమీకరణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని విల్సన్, శేఖర్ విజ్ఞప్తి చేశారు.

మోదీకి వ్యతిరేక పవనాలు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర - చీరాల: ప్రధానమంత్రి మోదీపై దేశ ప్రజలలో వ్యతిరేకత తీవ్రంగా ఉన్నదని వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీయే గద్దెదిగడం ఖాయమనీ, ప్రతిపక్ష ఇండియా కూటమి బలంపెంచుకుంటోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టరు కె. నారాయణ తెలిపారు. బాపట్ల జిల్లా చీరాలలో నివసిస్తున్న తన చిన్ననాటి స్నేహితుడైన పన్నెం సుబ్బారావు భార్య పన్నెం శ్రీవల్లి ఈ నెల 21న మరణించగా ఆ కుటుంబాన్ని ఆదివారం నారాయణ సీపీఐ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో నారాయణ మాట్లాడుతూ సైన్స్ వలన చంద్రాయన్ ప్రయోగం విజయవంతమైతే దానిని కూడా నరేంద్ర మోదీ మతపరం చేస్తున్నారన్నారు. ఆయన శంకుస్థాపన చేసిన అమరావతిని మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో మోదీ వ్యతిరేకత బాగా పెరిగిపోయిందనీ, అత్యధిక పార్టీలు ఇండియా కూటమి వైపు వస్తున్నాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో మాత్రం విభజన హామీలు గాలి కొదిలి మోదీ వద్దకు వెళ్లి యుద్ధ ఖైదీలు క్షమాభిక్ష అడిగినట్లు భిక్ష అడుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిరుమల ప్రకాశ్,సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు అచ్యుతుని బాబురావు, సీపీఐ పట్టణ కార్యదర్శి సైకం రాజశేఖర్, సుబ్బారావు, చేనేత జన సమాఖ్య నాయకులు మాచర్ల మోహనరావు, కృష్ణ మోహన్,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ పెన్షన్లు

నరసరావుపేట సభలో రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర- నరసరావుపేట: ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షన్ గ్యారెంటీ ఇచ్చిన విధంగా రాష్ట్రంలో కష్టజీవులకు కూడా పెన్షన్ గ్యారెంటీ ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి... అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేట చేరింది. ఈ సందర్భంగా జమిందార్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ పథకాలు అమలు చేసిన ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి గురించి ఆలోచించడం లేదన్నారు. కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని, 60 సంవత్సరాలు పైబడిన వారందరిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ ఐదు డిమాండ్లను ప్రధాన రాజకీయ పార్టీలకు అందజేస్తుందని చెప్పారు. పేదలకు కనీస పెన్షన్ రూ.5 వేలు ఇవ్వాలని, భార్యాభర్తలు అర్హులైతే ఇద్దరికీ పెన్షన్లు ఇవ్వాలని, విభిన్న ప్రతిభావంతులైన అన్ని తరగతుల వారికి రూ.7 వేలు పెన్షన్ ఇవ్వాలని, వృద్ధులకు ప్రత్యేకమైన ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలని, ఎల్ఐసీలో అన్ క్లైమ్‌గా ఉన్న లక్షా 70 వేల కోట్ల ధనాన్ని వృద్ధుల సంక్షేమ నిధిగా పెట్టాలని సమావేశంలో తీర్మానాలను హర్షధ్వనాలతో ఆమోదించాలని కోరారు. సమావేశానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ అధ్యక్షత వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. సమావేశంలో టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనిజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, నాయకులు వై.చెంచయ్య, యువజన, విద్యార్థి నాయకులు లెనిన్ బాబు, శివారెడ్డి, జాన్సన్ బాబు, సీజే ప్రతాప్, పరుచూరి రాజేంద్ర బాబు పాల్గొన్నారు.

మీడియా కమిషన్ ఏర్పాటుపై చర్చిద్దాం

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఐజేయూ సమావేశంలో నిత్యానంద రాయ్

పాట్నా: మీడియా కమిషన్ ఏర్పాటుపై విస్తృత స్థాయి చర్చ అవసరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ అన్నారు. కమిషన్ ఏర్పాటు గురించి జర్నలిస్టు నాయకులతో చర్చకు సిద్ధమని, అందుకోసం ఎక్కడికి రమ్మన్నా వస్తానన్నారు. బీహార్ రాజధాని పాట్నాలో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశాల రెండోరోజు ఆదివారం హోటల్ నిర్వాణలో నిర్వహించిన కార్యక్రమానికి రాయ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి యూనియన్ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. తొలుత శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను నిత్యానంత రాయ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎలక్ట్రానిక్, వెబ్, సోషల్ మీడియా విస్తరణ నేపథ్యంలో మీడియా రంగ స్వరూప స్వభావాలు పూర్తిగా మారిపోయాయని, ఈ పరిస్థితుల్లో మీడియా రంగ స్థితిగతులను అధ్యయనం చేయడానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. జర్నలిస్టుల భద్రత కోసం ఒక చట్టాన్ని చేయాలని సూచించారు. అన్ని పరిశ్రమల కార్మికులకు, ప్రభుత్వ సిబ్బందికి రెండుసార్లు వేతనాలు పెరిగినా, పత్రికా రంగంలో 15ఏళ్లుగా వేతనాలు పెరగలేదని శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనికి నిత్యానంద రాయ్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల పని పరిస్థితులు, వేతనాలు, భద్రత వంటివాటిపై జర్నలిస్టు సంఘాలతో కలిసి పనిచేస్తామని తెలిపారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్న ఐజేయూ కోరిక సమంజసమేనని, దానిపై చర్చించడానికి సిద్ధమన్నారు. అయితే దానిపై నిర్ణయం మాత్రం ఉన్నతస్థాయిలోనే జరగాల్సి ఉంటుందని చెప్పారు. మీడియా కమిషన్ గురించి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకు వెళ్తానని నిత్యానంద రాయ్ హామీ ఇచ్చారు. పాత్రికేయులపై దేశద్రోహం కేసులు పెట్టడానికి తాను వ్యతిరేకమన్నారు. ఎక్కడైనా అలాంటివి జరిగితే జర్నలిస్టు సంఘాలతో కలిసి నిలబడటానికి సిద్ధమేనని అన్నారు. ఐజేయూ రెండోరోజు సమావేశాల్లో పద్దెనిమిది రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు తమ తమ రాష్ట్రాలలో పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం యూనియన్ ప్రయత్నాలు గురించి మాట్లాడారు.

యూనియన్ ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్ జమ్మూ మాట్లాడుతూ ఐజేయూ పటిష్టం చేయడానికి జరుగుతున్న ప్రయత్నం ఫలిస్తోందని, త్వరలో మరికొన్ని రాష్ట్రాలలో అనుబంధ సంఘాలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. గతంలో చీలిన సంఘాలు కూడా మాతృ సంస్థకు తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. యూనియన్ పూర్వాధ్యక్షుడు ఎస్ఎన్ సిన్హా, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎంఏ మాజిద్, కోశాధికారి ప్రేమ్‌నాథ్ భార్గవ్, ఉపాధ్యక్షులు అమర్ మోహన్ ప్రసాద్, జి.ప్రభాకరన్, కార్యదర్శులు వై.నరేందర్ రెడ్డి, డి.సోమసుందర్, డీఎస్ఆర్ సుభాశ్ , ట్రైబ్స్ న్యూస్ ఎడిటర్ ఆలపాటి సురేశ్ కుమార్ తదితరులు మాట్లాడారు.

ఇదిలావుంటే, దేశంలో మీడియా పరిస్థితిని అధ్యయనం చేసేందుకు వెంటనే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, పాత్రికేయుల భద్రత కోసం ఒక ప్రత్యేక చట్టం చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. జర్నలిస్టులపై దాడులను నిరోధించడానికి, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు తెచ్చిన చట్టాల తరహాలో కేంద్ర ప్రభుత్వమే ఒక సమగ్ర చట్టం చేయాలని తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్‌లో పాత్రికేయులపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, మణిపూర్‌లో

శాంతి భద్రతల పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం డిమాండ్ చేస్తూ అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా డిమాండ్స్ డే పాటించాలని పిలుపు ఇచ్చింది. కృత్రిమమేధ - పర్యవసానాలు అంశంపై న్యూఢిల్లీలో జాతీయస్థాయి సదస్సు నిర్వహించాలని, మహిళా జర్నలిస్టుల సమస్యలపై అక్టోబర్‌లో హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. జాతీయ కార్యవర్గ సమావేశాల నిర్వహణలో ప్రధానపాత్ర పోషించిన జాతీయ ఉపాధ్యక్షుడు అమర్ మోహన్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు శివేంద్ర నారాయణ్ సింగ్, రాష్ట్ర అధ్యక్షులు నివేదితా ఝా, ప్రధానకార్యదర్శి కమల్ కాంత్ సహాయ్, రవి ఉపాధ్యాయ్, సీటూ తివారీ, జరీనా ఫాతిమాను శ్రీనివాస రెడ్డి సత్కరించారు.

చంద్రయాన్-3 సక్సెస్‌లో కీలకంగా ఉయ్యూరు యువ శాస్త్రవేత్త

విశాలాంధ్ర-ఉయ్యూరు: భారత జాతి గర్వపడే అద్భుత విజయాన్ని చంద్రయాన్-3తో సొంతం చేసుకున్న ఇస్రోలో యువ శాస్త్రవేత్తగా ఉన్నారు. ఉయ్యూరుకు చెందిన మధిర చైతన్య. చంద్రయాన్-3లో విజయంలో ఆయనది కీలక పాత్ర. ఇస్రోలో చైతన్య 'ఈ' కేటగిరి విభాగంలో పనిచేస్తూ... చంద్రయాన్-3 ప్రాజెక్టులో ముఖ్య భూమిక పోషించారు. చైతన్య ప్రాథమిక విద్యను స్థానిక ఫ్లోరా స్కూల్‌లో, ఇంటర్ చైతన్యలో ఐబిటీ విభాగంలో పూర్తిచేశారు. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విద్యను తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థలో పూర్తి చేశారు. 2008-12లో ఇస్రో సంస్థ ఎంపిక చేసిన 150 మంది యువ శాస్త్రవేత్త లలో చైతన్య ఒకరు. మంగళ్ యాన్, చంద్రయాన్-2, చంద్రయాన్-3లోనే కాకుండా పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ మిషన్స్‌లోని యాభైకి పైగా రాకెట్ లాంచింగ్ ప్రయోగాలలో చైతన్య కృషి ఉంది. చైతన్య తండ్రి వేంకటేశ్వరావు ఉయ్యూరులోని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ సంస్థలో డీఎంగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నేతలు చైతన్య తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి అభినందనలు తెలుపుతున్నారు.

నవభారత్ విజయచిహ్నం చంద్రయాన్

మహిళా శక్తి తోడైతే ఏది అసాధ్యం కాదు : మన్ కీ బాత్‌లో మోదీ

న్యూఢిల్లీ: ఎలాంటి పరిస్థితుల్లోనైనా గెలవడం తెలిసిన నవభారత్ శక్తి, సామర్థ్యాలకు చిహ్నంగా మిషన్ చంద్రయాన్ ఉందని ప్రధాని మోదీ అన్నారు. మహిళా శక్తి తోడైతే అసాధ్యం సుసాధ్యమవుతుందని, ఇందుకు లూనార్ మిషనే నిదర్శనమని తెలిపారు. మోదీ ఆదివారం మన్ కీ బాత్ సందర్భంగా చంద్రయాన్ మిషన్, మహిళాశక్తి గురించి మాట్లాడారు. మన ఆడబిడ్డలు పెద్ద పెద్ద లక్ష్యాలను పెట్టుకొని వాటిని సాధించే స్థాయికి ఎదిగినప్పుడు దేశాన్ని అభివృద్ధి చెందకుండా ఎవరు ఆపగలరని అన్నారు. అనంత అంతరిక్ష్యాన్ని వారు సవాల్ చేస్తున్నారన్నారు. చంద్రుడిపై చంద్రయాన్-3 ల్యాండర్ దిగి మూడు రోజులు అయినప్పటికీ ఈ చరిత్రాత్మక విజయం గురించి ఎంత మాట్లాడుకున్నా తక్కువేనని మోదీ చెప్పారు. సూర్యుడు ఉదయించింది ఇప్పుడే అంటూ రాసిన తన గేయాన్ని వినిపించారు. మోదీ మాట్లాడుతూ 'ఈ మిషన్‌కు సంబంధించిన ఒక ప్రత్యేకాంశాన్ని మీతో చర్చిస్తున్నా. మహిళల సారధ్యంలో అభివృద్ధి గురించి ఎర్రకోట మీద నుంచి నేను మాట్లాడటం మీకు గుర్తుండే ఉంటుంది. మహిళాశక్తి తోడైతే అసాధ్యాన్ని సుసాధ్యం చేయొచ్చు. ఇందుకు చంద్రయాన్ మిషన్ మంచి ఉదాహరణ' అని అన్నారు. మిషన్‌లో మహిళా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు పాల్గొన్నారని, ప్రాజెక్టు డైరెక్టర్, వివిధ వ్యవస్థల నిర్వాహకులుగా బాధ్యతలు చేపట్టారని చెప్పారు. పెద్ద కలల సాకారానికి కసరత్తు కూడా అందేస్థాయిలో జరగాలని అన్నారు. శాస్త్రవేత్తలతో పాటు ఇతర రంగాలు కూడా చంద్రయాన్-3 విజయంలో భాగస్వాములని, అనేకమంది తోడ్పాటుతో ఈ విజయం లభించిందని చెప్పారు. 'సమ్మిళిత కృషితో విజయం సిద్ధిస్తుంది. చంద్రయాన్-3 ఘనవిజయం. భవిష్యత్‌లోనూ మరిన్ని విజయాలు అందుకోగలమని ఆకాంక్షిస్తున్నా' అని ప్రధాని అన్నారు.

'ఇండియా'లోకి మరిన్ని పార్టీలు: నితీశ్

పాట్నా: ప్రతిపక్షాల ఇండియా కూటమి త్వరలో ఆర్థిక రాజధాని ముంబైలో సమావేశం కాబోతోంది. ఈ సందర్భంగా మరిన్ని పార్టీలు కూటమిలో చేరబోతున్నట్లు బీహార్ సీఎం, జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ తెలిపారు. ముంబై సమావేశంలో సీట్ల సర్దుబాటు వంటి అంశాలను చర్చిస్తామన్నారు. విపక్షాలను ఏకతాటిపైకి తేవడంతో నితీశ్ క్రియాశీల పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఆయన ఆదివారం పాట్నాలోని ఓ ప్రాజెక్టు సందర్శన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 'సార్వత్రిక ఎన్నికల వ్యూహాలను ముంబై సమావేశంలో ఇండియా కూటమి చర్చిస్తుంది. సీట్ల సర్దుబాటు వంటివి చర్చకు వస్తాయి. మరెన్నో అజెండాలు ఖరారవుతాయి. మరికొన్ని పార్టీలు కూటమిలో చేరబోతున్నాయి' అని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు సాధ్యమైనన్ని పార్టీలను ఏకతాటిపైకి తేవడమే తన ఉద్దేశమని, అందుకోసం కృషిచేస్తున్నా అని చెప్పారు. తనకు పదవుల ఆశ లేదన్నారు. ఈనెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో ముంబైలో ఇండియా కూటమి మూడో సమావేశం జరగబోతోంది. కూటమిలో 26 పార్టీలు ఉన్నాయి. ఇంతకుముంకు పాట్నా, బెంగళూరులో సమావేశాలు జరిగాయి.

దురాగతాలకు కేంద్రంగా మధ్యప్రదేశ్

దళితుడి మూకహత్య: ఎనిమిది మంది అరెస్టు

భోపాల్/సాగర్: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్ బడుగు, బలహీన వర్గాలపై దురాగతాలకు కేంద్రంగా మారింది. తాజాగా ఓ దళిత యువకుడు మూకహత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎనిమిది మంది అరెస్టయ్యారు. మృతుడు నితిన్ అహిర్వార్ అలియాస్ లాలూ(18) ఖురై దేహత్ (రూరల్) పోలీసు స్టేషన్ పరిధిలోని బొరోడియా నినాగిర్ గ్రామవాసి. గురువారం అతనిపై మూకదాడి జరిగింది. నిందితుల్లో తొమ్మిది మందిని గుర్తించగా, మరో ముగ్గురు, నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఉన్నారు. వీరందరిపై ఐపీసీలోని సెక్షన్ 307 కింద కేసు నమోదైంది. సాగర్ జిల్లాలోని ఆసుపత్రికి తరలిస్తుండగా బాధితుడు తుదిశ్వాస విడిచాడు. దీంతో నిందితులపై ఐపీసీలోని సెక్షన్ 302, ఎస్సీ, ఎస్టీ దురగాతల చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదైందని ఏఎస్పీ సంజీవ్ ఉయికే తెలిపారు. పాతకక్షలే ఈ ఘటనకు కారణంగా చెప్పారు. తొలుత నిందితుల్లో ఎవరినీ అరెస్టు చేయకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి లాలూ కుటుంబం నిరాకరించింది. కలెక్టర్ జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. తన సోదరుడిని నిర్దాక్షిణ్యంగా కొట్టి చంపారని, వేధింపులకు సంబంధించిన పాత కేసులో రాజీ కోసం కొందరు ఒత్తిడి తెచ్చారని మృతుడి సోదరి చెప్పారు. ఇదే విషయమై ఏఎస్పీ ఉయికే స్పందిస్తూ మృతుడి సోదరి 2019లో నలుగురు వేధించారని, కొట్టారని ఎఫ్ఐఆర్ నమోదు చేయగా నిందితులు అరెస్టు అయ్యారని, ఈ కేసు విచారణలో ఉందని తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తథ్యం: ఖర్గే

దళితులపై దాడులు, దురాగతాలకు ప్రయోగశాలగా మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉందని విపక్షాలు దుయ్యబట్టాయి. కేంద్రం-రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, బీఎస్పీ అధినేత్రి మాయావతి విమర్శలు చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి తథ్యమన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలపై దాడులకు ప్రజలే గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఖర్గే స్పందిస్తూ 'దళిత కుర్రాడిని సాగర్ జిల్లాలో కొందరు కొట్టి చంపారు. అతని తల్లిని కూడా గూండాలు వదల్లేదు. సాగర్‌లో సంత్ రవిదాస్ ఆలయాన్ని నిర్మిస్తానన్న ప్రధాని... మధ్యప్రదేశ్‌లోని దళితులు, గిరిజనులపై దురాగతాలు, అన్యాయాలపై నోరు విప్పరు. కెమెరా ముందు బడుగువర్గాల వారికి పాదపూజ చేయడం ద్వారా తన నేరాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి చౌహాన్ చేస్తారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో దళితులపై నేరాల రేటు జాతీయ సగటు కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉంది' అని అన్నారు. మధ్యప్రదేశ్ ప్రజలు ఇక బీజేపీ వలలో చిక్కే పరిస్థితి లేదని, బీజేపీకి ఓటమి తప్పదని ఖర్గే వ్యాఖ్యానించారు. బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌నాథ్ డిమాండ్ చేశారు. విపక్షాల ఆరోపణలను బీజేపీ మధ్యప్రదేశ్ కార్యదర్శి రజనీశ్ అగర్వాల్ తోసిపుచ్చారు. ఈ కేసులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటు న్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ రాజస్తాన్‌లోని దళితులపై దాడుల గురించి మౌనం వహిస్తూ తమను విమర్శిస్తున్నారని అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.